ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 13 డిసెంబరు 2024


రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న గ్రంధి

వైసీపీకి రాజీనామా

ఫ్యాన్‌కు షాక్

ఇందులో కొనసాగితే ప్రజాభిమానాన్ని పొందలేను : గ్రంధి శ్రీనివాస్

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వైసీపీకి షాక్‌ల మీద షాకులు తగులుతున్నాయి. వైసీపీ అధినేత జగన్ వైఖరిని నిరసిస్తూ ఆ పార్టీలో ఇమడలేక రాజీనామాలు చేస్తున్న నేతల సంఖ్య రోజు రోజుకు క్రమేపీ పెరుగుతోంది.

ఇప్పటికే ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణతోపాటు పెద్ద సంఖ్యలో జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల రాజీనామాలతో చాలాచోట్ల వైసీపీ ఖాళీ అయింది.

తాజాగా భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రాజీనామా చేశారు. మరికొందరు పేర్లు వినిపిస్తున్నారు. రేపు ఎవరనేది చర్చ నడుస్తోంది.

ఉమ్మడి పశ్చిమలో వరుస రాజీనామాలతో పార్టీ కుదేలు

ఏలూరు నగర మేయర్, జడ్పీ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని.. ఎమ్మెల్సీ జయమంగళ, తాజాగా గ్రంధి.. రేపెవరో ?

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. సుదీర్ఘ కాలంగా అధిష్ఠానంపై తీవ్ర అసంతృప్తితో వున్న మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నియోజకవర్గ కన్వీనర్ పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. గ్రంధి రాజీనామాతో వైసీపీకి భీమవరం నియోజకవర్గంలో పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయింది. పార్టీని ముందుండి నడిపించే నాయకత్వం కొరవడింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఓటమి చవిచూసిన శ్రీనివాస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. జిల్లా సమావేశాలకు హాజరు కాలేదు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించారు. భీమవరం మినహా మిగిలిన అన్ని నియోజకవర్గ కన్వీనర్లు బాధ్యత వహించారు. పార్టీ ముఖ్యులు హాజరైన సమయంలోను గ్రంధి గైర్హాజరయ్యారు. కీలక నాయకులు పేర్ని నాని, కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు గ్రంధితో మంతనాలు సాగించారు. బుజ్జగించారు. ఇవేమీ ఫలించలేదు. ఇటీవల వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోను గ్రంధి భేటీ అయ్యారు. ఈ సమయంలో తన మనోభావాలను స్పష్టం చేశారు. మే తర్వాతే తన నిర్ణయం చెబుతానని తేల్చి చెప్పారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ నిరసనలు చేపట్టే ప్రయత్నం చేస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుల సమస్యలు, ధాన్యం కొనుగోళ్లు, విద్యుత్ బిల్లుల భారం తదితర అంశాలపై ఉద్యమం చేయాలని నిర్ణయించింది. భీమవరం కలెక్టరేట్ వద్ద నిరసనకు జిల్లా నాయకత్వం పిలుపునిచ్చింది. దీనిపై గ్రంధి శ్రీనివాస్‌కు సమాచారం ఇవ్వకుండానే వైసీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు నేరుగా భీమవరం నియోజకవర్గ పార్టీని తన భుజాన్ని వేసుకున్నారు. శుక్రవారం నిర్వహించే ధర్నాకు రావాలని నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు తెలియజేశారు. ఇదీ గ్రంధి మనసును గాయపరిచింది. ఇక పార్టీలో ఉండటం వృథా అని పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇది భీమవరం వైసీపీలో కలకలం రేపింది. పార్టీలో గ్రంధి సుదీర్ఘకాల ప్రస్థానానికి తెరపడింది. పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన కొనసాగుతున్నారు. 2014 నుంచి భీమవరం నుంచి వైసీపీ తరఫున పోటీ చేస్తున్నారు. 2019 నుంచి 24 వరకు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. మంత్రి పదవిని ఆశించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై నెగ్గానన్న ధీమాతో ఉండేవారు. తనకు అధిష్ఠానం కీలక బాధ్యతలు ఇస్తుందని ఆశించారు. అవేమీ నెరవేరలేదు. ఇది కాస్త గ్రంధిని నిరాశను కలిగించింది. చివరకు ఇందులో కొనసాగితే ప్రజాభిమానాన్ని పొందలేనని ప్రకటించి రాజీనామా చేశారు.

ఉలిక్కిపడ్డ నాయకత్వం

గ్రంధి రాజీనామాతో పార్టీ అధిష్ఠానం ఉలిక్కిపడింది. అందుబాటులో వున్న కొందరు నాయకులతో జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు సంప్రదింపులు జరిపారు. క్యాడర్‌కు ఆయన భరోసా ఇచ్చారు. పార్టీ కార్యకలాపాలను నిర్వహించే విషయంలో తాము ముందుంటామని, శుక్రవారం నిర్వహించే ధర్నాలో పాల్గొనాలని కోరారు. మరో వైపు గ్రంధి అనుచరవర్గం పెద్ద సంఖ్యలో రాజీనామాలకు పావులు కదుపుతోంది. దీంతో భీమవరం రాజకీయం రసవత్తరంగా మారింది.

లక్ష్మీ.. సందడి



తాడేపల్లిగూడెంలో సినీ నటి మీనాక్షి చౌదరి (లక్కీ భాస్కర్ హీరోయిన్) సందడి చేశారు. గురువారం చెన్నయ్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించేందుకు వచ్చిన ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్య లో తరలి వచ్చారు. వారితో సెల్‌ఫోన్‌లో సెల్ఫీ తీసుకునేందుకు ఆమె ఇలా రెడీ అయ్యారు.



అమరావతిలో రెండో రోజు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో ఏలూరు, పశ్చిమ గోదావరి కలెక్టర్లు వెట్రిసెల్వి, నాగరాణి

రేపటి నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

ఏలూరుసిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఏలూరు జిల్లాలో విద్యుత్ శాఖ (ఏపీఈపీడీసీఎల్) ఆధ్వర్యంలో జరుగుతాయని ఎస్ఈ పి.సాల్మన్‌రాజు తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యుత్ పొదుపు అవగాహనా ర్యాలీలు జిల్లా ప్రధాన కేంద్రం, డివిజన్ కేంద్రాల్లో నిర్వహించబడుతుందన్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ , చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. స్వయం సహాయక సంఘ మహిళా బృందాలతో ముగ్గుల పోటీలు నిర్వహించి, వారికి ఇంధన సంరక్షణ పద్ధతులు , స్టార్ రేటెడ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానం అనే అంశంపై నిష్ణాతులచే ఇంజనీరింగ్ కళాశాలల్లో వర్క్‌షాపులు నిర్వహిస్తారన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకతపై విద్యుత్ కార్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తారని, గ్రామీణ ప్రాంతంలో జానపద కళాకారులు , జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్య కతపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఈనెల 20వ తేదీన బహు మతులు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు.



కూత.. కూసినట్టే!

భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైనుకు మోక్షం

చాన్నాళ్లుగా ఎదురుచూస్తున్న కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైనుకు కేంద్రం తగినంత బడ్జెట్ కేటాయించింది. చిన్నపాటి మార్పులతోనే ఈ రైల్వే మార్గం పూర్తి చేసేందుకు రంగం సిద్ధం చేశారు. రాబోయే ఐదేళ్లల్లోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సంకల్పించారు. భారీ అంచనా వ్యయంతో ప్రాజెక్టు మంజూరు చేస్తున్నట్టుగా రైల్వే మంత్రి రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరికి రాత పూర్వకంగా తెలిపారు. ఏజెన్సీ మీదుగా సాగే ఈ రైల్వే మార్గం పూర్తయితే దూర భారం తగ్గుతుంది.

- నిర్మాణానికి రూ.2 వేల 155 కోట్లు
- ఎంపీ పురందేశ్వరికి రైల్వే మంత్రి లేఖ
- ఇన్నాళ్లు స్థానికులు పడిన కష్టాలకు తగిన ఫలం
- ఏజెన్సీ మీదుగా ఇక రైలు కూతలే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

కొవ్వూరు-భద్రాచలం రైల్వే మార్గం విషయంలో సర్వేల పేరిట దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగానే కాలయాపన జరిగింది. కొవ్వూరు-భద్రాచలం మధ్య అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండడం, రైల్వే లైను నిర్మించాలంటే కొండ వాగులు, పిల్ల వాగులపై దాదాపు 120 చోట్ల బ్రిడ్జిలు కట్టాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రాజెక్టు వ్యయంలో సగ భాగం వీటి నిర్మాణానికే ఖర్చయ్యేది. అందుకనే రైల్వే మంత్రిత్వ శాఖ ఈ రైల్వే మార్గంపై సర్వేలతోనే సరిపుచ్చింది. తొలిసారిగా 1960లో సర్వే సాగింది. ఈ మార్గంకు ఉన్న ప్రాధాన్యతను అప్పుడు జరిగిన సర్వేలో నివేదించారు. అయినా రిజర్వు ఫారెస్టు భాగం ఎక్కువగా ఉండడంతో అటవీ, పర్యావరణ అనుమతులు తప్పవని, దీనికి భిన్నంగా ఏదైనా ఆలోచన చేయవచ్చన్న ధోరణిని రైల్వే శాఖ ప్రదర్శిస్తూ వచ్చింది. ప్రతీ బడ్జెట్‌లోను ఈ రైల్వే లైను ప్రస్తావన సాగుతున్నా బడ్జెట్‌లో రూపాయి విదల్చడంలేదు. గడిచిన పదేళ్లుగా కేవలం సర్వే, ఇతర పనుల నిమిత్తం రూ.40 కోట్లకు పైగా కేటాయించారు. అయితే ఈ స్వల్ప బడ్జెట్ కేటాయింపులతో రైల్వే ప్రాజెక్టుకు నీళ్లొదులుకోవాల్సిందేనని అందరూ భావించారు. గతంలో ఎంపీలుగా మాగంటి బాబు, కావూరు సాంబశివరావు, కోటగిరి శ్రీధర్, ప్రస్తుత సిట్టింగ్ ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ ఈ రైల్వే లైను కోసం పార్లమెంటులో పట్టుపడుతూ వచ్చారు. ప్రధా ని దగ్గర నుంచి రైల్వే మంత్రి వరకు వినతులు అందజేశారు. అయినప్పటికీ రైల్వే శాఖ మాత్రం చూద్దాం.. చేద్దాం అన్నట్టుగానే వ్యవ హరించింది. ఈ పరిస్థితులపై రాష్ట్రం-రైల్వే జనరల్ మేనేజర్‌తో ఏటా జరిగే కో-ఆర్డినేషన్ కమిటీల్లో ప్రస్తావనకు తెచ్చేవారు. ప్రతీ ఎన్ని కల్లోను ఈ రైల్వే లైను అన్ని పార్టీల హామీల అంబులపొదిలో ఉండేది. గత దశాబ్దకాలంగా తెలంగాణ రాష్ట్ర పరిధిలోని సత్తుపల్లి పరిసరా ల్లో బొగ్గు నిక్షేపాలు బయట పడ్డాయి. సింగరేణి కాలరీస్ పరిధిలోకి ఈ భూభాగమంతా చేరింది. ఈ తరుణంలో సత్తుపల్లిలో లభించే బొగ్గును ఇతర ప్రాంతాలకు తరలించాలంటే రైల్వేయే అనుకూల రవాణా మార్గం. కొత్తగూడెం-సత్తుపల్లి మధ్య కాస్ట్ టూ కాస్ట్ షేరింగ్ పద్ధతిలో సింగరేణి యాజమాన్యం 706 కోట్లు ఖర్చు భరించగా, సౌత్ సెంట్రల్ రైల్వే తన వాటా 85 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. పనులన్నీ పూర్తయ్యి సత్తుపల్లి-కొత్తగూడెం మధ్య రైల్వే మార్గం క్లియర్ అయ్యింది. ఇప్పుడు కొవ్వూరు-సత్తుపల్లి మధ్య రైల్వే లైను నిర్మిస్తే కొంత ప్రతిపాదిత వ్యయం తగ్గడమే కాకుండా రాబోయే ఐదేళ్లల్లోనే పనులు పూర్తి చేయడానికి అవకాశం ఏర్పడుతుందని భావిస్తున్నారు.

కొత్తలైనుకు 2 వేల 155 కోట్లు

కొవ్వూరు-భద్రాచలం రోడ్డు లైను నిర్మాణానికి వీలుగా రూ.2 వేల 155 కోట్లు ప్రతిపాదిత వ్యయం గుర్తించి మంజూరు చేస్తున్నట్టు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి రాతపూర్వకంగా తెలిపారు. ఇన్నాళ్ల రైల్వే బడ్జెట్‌లో ఈ తరహా పద్దు ఎక్కడా కనిపించకపోగా ఇప్పుడు నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించడంతో హర్షామోదాలు వ్యక్తమ వుతున్నాయి. మరోవైపు ఈ రైల్వే మార్గం నిడివి 165 నుంచి 119 కిలోమీటర్లకు తగ్గింది కూడా. కొంత అలైన్‌మెంట్‌లో మార్పులు, చేర్పులు చేసి సత్తుపల్లి-దేవరపల్లి వరకు ఇప్పటికే గ్రీన్‌హైవే నిర్మిస్తున్నందున దానికి సమాంతరంగా కొత్త రైల్వే లైనుకు దాదాపు రూటు క్లియర్ అయినట్టే. ఇప్పుడు తాజాగా టి.నర్సాపురం, పుట్టగట్ల గూడెం మీదుగా రైల్వే లైను వెళ్లబోతుంది.

టీచర్లకు నెలవారీ పని సర్దుబాటు వద్దు

ఏపీటీఎఫ్ డిమాండ్

ఏలూరు అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో ఉపాధ్యాయులకు చేపట్టిన నెలవారీ పని సర్దుబాటు ప్రక్రియను నిలుపుదల చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సాల్మన్‌రాజు, జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర డిమాండ్ చేశారు. విద్యాశాఖ నిర్ణయం వల్ల పాఠశాలల నిర్వహణకు తీవ్ర ఆటంకం కలుగుతోందన్నారు. టైంటేబుల్ రూపకల్పన, తరగతులను కేటాయించడంలో ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోందన్నారు. విద్యార్థులకు బోధన, అవగాహనలో సమస్యలు తప్పవని హెచ్చరించారు. ఒక స్కూలులో సర్‌ప్లస్‌గా గుర్తించబడిన ఉపాధ్యాయుడు మరో పాఠశాలకు సర్దుబాటు చేసిన వ్వుడు, తదుపరి నెలలో సంబంధిత పాఠశాలకు కొరత ఏర్పడిన సందర్భంలో ఆ ఉపాధ్యాయుడిని పూర్వపు పాఠశాలకు పంపకుండా మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలన్న నిబంధనల వల్ల బదిలీల కౌన్సెలింగ్ ఎందుకని ప్రశ్నించారు. దీని బదులు ప్రతీనెలా పదోన్నతి ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ యాజమాన్యంలోని ఉపాధ్యాయులు, సీఆర్టీలను 500 కిలోమీటర్లకు పైబడి ఇతర జిల్లాలకు డిప్యూటేషన్లపై పని సర్దుబాటు ప్రక్రియలో భాగంగా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. ఈ ప్రక్రియలను నిలుపుదల చేయకపోతే ప్రత్యక్ష ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న షా చౌదరి

కోల్డ్‌స్టోరేజీల నిర్మాణానికి ప్రోత్సాహం

కేంద్ర గిడ్డంగుల సంస్థ డీజీఎం షా చౌదరి

కైకలూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులు గిట్టుబాటు ధర వచ్చేవరకు చేపలు, రొయ్యలు ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్‌లు ఎంతో ఉపయోగపడతాయని కేంద్రప్రభుత్వం గిడ్డంగుల సంస్థ డీజీఎం ఎస్‌హెచ్‌డీ షా చౌదరి అన్నారు. గురువారం కైకలూరు మత్స్యశాఖ కార్యాలయంలో రైతులు, చేపల రైతుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చేపల రైతులు కలిసి ప్రొడ్యుసర్ ఆర్గనైజేషన్ కమిటీగా ఏర్పాటు చేసుకుని కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం చేసుకునే వెసులు బాటును కేంద్రప్రభుత్వం కల్పిస్తోందన్నారు. చేపల, రొయ్యల ఉత్పత్తుల ధరలు తగ్గిన సమయంలో నష్టాలకు రైతులు అమ్మకాలు చేస్తున్నారని కోల్డ్ స్టోరేజ్ ఉండడంతో రైతులు వారి ఉత్పత్తులను అందులో నిల్వ చేసుకునేందుకు ఉపయోగపడతాయన్నారు. దీనిపైన మరొకసారి క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తామన్నారు. కైకలూరు పరిసర ప్రాంతంలోని పలు చేపల ఎగుమతి సంస్థలను పరిశీలించారు. చేపలు ఏవిధంగా ఎగుమతి చేస్తున్నారనే అంశాలను పరిశీలించి తెలుసుకున్నారు. మత్స్యశాఖ ఏడీ రాజ్‌కుమార్, చేపల రైతుల అసోసియేషన్ అధ్యక్షుడు నంబూరి వెంకట రామరాజు, గుర్రాజు, శ్యాంప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతాం..

శివారెడ్డి, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్

ఈ ఇంటర్వ్యూ..



ఏలూరు టూటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : 'ఏలూరును స్వచ్ఛనగరంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రాబోయే ఆరునెలల్లో నగరాన్ని సంపూర్ణ పారిశుధ్య నగరంగా తీర్చిదిద్దుతాం. మా సిబ్బందికి ప్రజలు సహకరించాలి' అంటూ నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన 'ఆంధ్ర జ్యోతి'తో పలు అంశాలపై మాట్లాడారు..

చెత్త సేకరణకు తీసుకుంటున్న చర్యలు ?

తెల్లవారు జామునే పారిశుధ్య సిబ్బంది ఆటోలు పుష్‌కార్ట్‌లతో ఇంటింటికి వచ్చి చెత్తసేకరణ చేస్తున్నారు. తడిచెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరిస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా పోణంగిలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం.

రోజు ఎన్ని టన్నుల చెత్త సేకరిస్తున్నారు ?

నగరంలో విలీన గ్రామాలతో కలిపి మూడు లక్షల జనాభా ఉన్నారు. 90 వేలకు పైగా కుటుంబాలున్నాయి. వీరి నుంచి ప్రతీరోజు 103 టన్నుల చెత్తను కలెక్ట్ చేస్తున్నాం. దీనిలో తడి చెత్త 55 టన్నులు, పొడిచెత్త 45 టన్నులు ఉంటుంది.

పరిశుభ్రతపై ప్రజల్లో ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

ఇంటిలో చెత్తను రోడ్లపై పడేయకుండా డ్వాక్రా మహిళలు పారిశుధ్య సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ పది కుటుంబాలకు ఒక డ్వాక్రా మహిళను బాధ్యులుగా నియమించాం. ఆమె తన చుట్టుపక్కల కుటుంబాలకు తడిచెత్త, పొడిచెత్త వేరు చేయడం, డ్రెయిన్లలో, రోడ్లపై పడవేయకుండా పారిశుధ్య సిబ్బందికి అప్పజెప్పే విధంగా అవగాహన కల్పిస్తారు. సుమారు తొమ్మిది వేల మంది డ్వాక్రా మహిళలను 50 డివిజన్లలో నియమించాం.

రహదారులు, డ్రెయిన్లను శుభ్రపరచడానికి తీసుకుంటున్న చర్యలు ?

రాత్రి పగలు రెండుపూటలు మూడు షిఫ్టుల ద్వారా పారిశుధ్య సిబ్బంది రహదారులు, డ్రెయిన్లను శుభ్రం చేస్తున్నారు. రాత్రి ఒక టీమ్ 4గంటల వరకు పని చేస్తుంది. ఉదయం 4గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఒక టీమ్, మధ్యాహ్నం 2గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మరో టీమ్ పని చేస్తుంది.

దోమలు ప్రబలకుండా ఏ చర్యలు తీసుకుంటున్నారు ?

ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నాం. డ్రెయిన్లలో దోమల లార్వా పెరగకుండా ఆయిల్ బాల్స్ వేస్తున్నాం. రాత్రిపూట ఫాగింగ్, దోమల నిర్మూలనకు స్ప్రేయింగ్ చేస్తున్నాం.

సేకరించిన చెత్తను ఏం చేస్తున్నారు?

తడి చెత్తతో గ్యాస్ తయారు చేసే ప్లాంటుకు టెండర్లు పిలిచాం. టెండర్లు దక్కించుకున్న గ్యాస్‌ప్లాంట్ నిర్వహకుల నుంచి వచ్చే ఆదాయాన్ని నగరాభివృద్ధికి ఖర్చుపెడతాం. పొడిచెత్తను కూడా ఏజన్సీలకు అప్పగిస్తున్నాం.



7

రాజమండ్రి టు న్యూ ఢిల్లీ

ఇండిగో విమాన సర్వీసులు ప్రారంభం

రెండో రోజు టీడీఆర్ బాండ్ల స్థలాలను పరిశీలించిన విజిలెన్స్ అధికారులు

భీమవరం టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపాల్టీలో గతంలోను, గత ఐదేళ్ళలో ఇచ్చిన టిడిఆర్ బాండ్లకు సంబంధించిన స్థలాలను రెండో రోజైన గురువారంనాడు కూడా విజిలైయిన్స్ అధికారులు పరిశీలించారు. బుధవారం నాడు దాదాపు 15 స్థలాలల్లో కొన్నింటిని మాత్రమే విజిలైయిన్స్ అధికారలు పరిశీలించారు. దీంతో గురువారంనాడు ఉదయంనుంచి మిగిలిన టిడిఆర్ స్థలాలను మునిసిపల్ టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన అధికారులతో కలసి పరిశీలించి ప్లాన్‌లతో చూస్తూ వివరాలను సేకరించుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడా టిడిఆర్‌లను పరిశీలించారు.



ఐడియా అదిరింది !

వ్యాపారం బావుండాలంటే ఒకప్పుడు మంచి నాణ్యత .. తక్కువ ధరలు.. అనువైన ప్రదేశం.. ఇవన్నీ చూసుకునే వారు.. ఇటీవల కాలంలో కొత్త ఒరవడి వచ్చింది..రుచితో పాటు అభిరుచి ఉండాలని భావిస్తున్నారు.. అందుకే హోటళ్లకు వెరైటీ పేర్లు పెట్టి ఆకర్షిస్తున్నారు.. తిందాంరా..!, వియ్యాలవారి విందు, అరిటాకు.. ఇలా పెట్టినవే.. తాజాగా భీమవరంలో పైన ఫొటోల్లో కనిపిస్తున్న పేర్లు ట్రెండ్ అవుతున్నాయి.. భలే పేర్లు పెట్టారురా అంటూ చర్చించుకుంటున్నారు...





మంచు కురిసే వేళ

మంచుకురిసే వేళ ఏ దృశ్యమైనా సుందర మనోహరంగా ఉంటుంది.. తెలతెలవారుతుండగా మంచు బిందువులతో మెరుస్తున్న రోడ్లపై వేగంగా వెళ్లే వాహనాలు.. రైతులు తమ పంటపొలాల్లో పొద్దు పొడిచే వరకు పనులు చేసుకునే దృశ్యాలు ఏలూరులో గురువారం కనిపించాయి...



భలే..భలే జీడి

షష్ఠి ఉత్సవాల్లో ఇవే హైలెట్

వియ్యపురాలి జీడిలుగా పేరు..

ముదినేపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఉభయ గోదావరి జిల్లాల్లో వియ్యపురాలి జీడిలకు ఒక ప్రత్యేక ఉండేది. వివాహ సమయాల్లో తమ కుమార్తెను అత్తింటి వారికి కాపురానికి పంపే సందర్భంలో బెల్లంతో తయారు చేసిన జీడిలను వియ్యపురాలికి కానుకగా పంపేవారు. అందుకే ఇవి వియ్యపురాలి జీడిలుగా పేరుగాంచాయి. అయితే ఈ సంప్రదాయం రాను రాను తగ్గుముఖం పట్టి కొత్త సారెల సంప్రదాయం రావడంతో ఈ వియ్యపురాలి జీడిలు కాస్తా వ్యాపార రంగంలోకి అడుగు పెట్టాయి. వీటిని తయారు చేసే వ్యాపారులు ఇప్పటికీ వియ్యపురాలి జీడిలుగా అమ్ముతున్నారు. ఎందుకంటే గతంలో వాటికి ఒక పేటెంట్ పేరు ఏర్పడి ప్రసిద్ధి చెందటంతో దుకాణాల్లో వియ్యపురాలి జీడిలుగానే చెలామణి జరుగుతోంది. ఉత్సవాల్లో ఈ జీడిల అమ్మకం జోరుగా సాగుతుంది. ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో ఏడాదికి ఒకసారి జరిగే వార్షిక షష్ఠి కల్యాణ తిరునాళ్లో జీడిల దుకాణాలు పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేస్తారు. అమ్మకాలు కూడా అలాగే ఉంటాయి. తూర్పుగోదావరి జిల్లా అమలాపురం ప్రాంతానికి చెందిన వ్యాపారులు ఎక్కువగా ఇక్కడ వ్యాపారం చేస్తారు. సుమారు దశాబ్ద కాలంగా స్థానికులు కూడ కొందరు ఈ వ్యాపారం నిర్వహిస్తున్నారు. అక్కడికక్కడే గంట వ్యవధిలోనే వేడివేడిగా తయారు చేసి అమ్ముతుండటంతో ఈ జీడీలు హాట్ కేక్‌లుగా అమ్ముడు పోతున్నాయి. కేజీ రూ.160 చొప్పు అమ్ముతారు.

బెల్లంతోనే తయారీ..

పూర్తి బెల్లంతోనే ఈ జీడిలను తయారు చేస్తారు. ముందుగా పెద్ద అల్యూమినియం పాత్రలో బెల్లం పాకం పట్టి, గట్టి పరచి, పెద్ద సుద్దగా తయారు చేస్తారు. ఆ బెల్లపు సుద్దను సాగదీసి కడ్డీలుగా తయారు చేసి రౌండు ముక్కలుగా నరుకుతారు. చూసేందుకు చాలా తేలిగ్గా కనిపించినా పాకం గట్టి పరచడం.. వాటిని జీడిలుగా తయారు చేయడం కష్టమైన ప్రక్రియే..

లాభాలు తగ్గాయి



పూర్వీకులు వియ్యపురాలి జీడిలను తయారు చేసి వివాహ సంప్రదాయాలు పాటించే వారికి సరఫరా చేసేవారు. ఇప్పుడు సరుకుల ధరలు పెరిగాయి.. తయారు చేసే వారికి వేతనాలు పెరగటంతో పెద్దగా లాభాలు ఉండడం లేదు.. సంప్రదాయ వ్యాపారం వదల్లేక ఇదే వృత్తిలో కొనసాగుతున్నాం.

-గోకరం వీరబాబు, అమలాపురం



తయారు చేస్తున్న దృశ్యం



సింగరాయపాలెంలో జీడిల దుకాణం

జై హనుమాన్

నేడు హనుమద్వ్రతం

కామవరపుకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మార్గశిర మాసంలోని శుక్లపక్షంలో 13వ రోజున హనుమద్వ్రతం జరుపుకోవాలని హిందూ పురాణాల్లో తెలియజేయబడింది. మృగశిరా నక్షత్రం హనుమతునిడి ఇష్టమైనది. భక్తసులభుడైన హనుమంతుని అనుగ్రహం పొందేందుకు మార్గశిర త్రయోదశినాడు ఆయన వ్రతం ఆచరించి ప్రసాదం స్వీకరించాలని శాస్త్రాలు తెలియజేస్తున్నాయి.. ఈ వ్రతం ఆచరించడం ద్వారా భక్తులకు హనుమంతుని అనుగ్రహం, రక్షణ కలుగుతుందని వేద పండితులు సుదర్శనం రామదుర్గ కుమారా చార్యులు తెలిపారు. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ఈ వ్రతాన్ని నిర్వహించి సత్ఫలితాలు సాధించా రని చెప్పారు. పాండవుల భార్య ద్రౌపతి ఈ వ్రతాన్ని మొదటిసారి పాటించినట్టు తెలుస్తోంది. హనుమద్వ్రతం రోజున భక్తులు రెండు ముఖ్యమైన ఆచారాలను నిర్వహించాలన్నారు. హనుమంతుడు పంపా తీరంలో విహరించేవాడు కాబట్టి పంపాతీరంలోనే ఈ వత్రం ఆచరించాలని శాస్త్రవచనం.. అది అందరికీ సాధ్యం కాదు కాబట్టి పంపా కలశం ఏర్పాటు చేసి, హనుమత్ పూజ జరిపి ఓం నమో వాయునందనాయ అనే మంత్రాన్ని జపిస్తూ 13 ముడులతో పవిత్రమైన తోరాన్ని ధరించాలి. తరువాత భక్తులు దేవాలయాల్లో లేదా నివాసాల్లో హనుమంతునికి హృదయ పూర్వక ప్రార్థనలు చేయాలి. ఈ రోజున గోధుమలను దానం చేయడం పుణ్యప్రదం. ఆచారాలను నిర్వర్తించడం ద్వారా భక్తులు హనుమంతుని అనుగ్రహం, రక్షణ కలుగుతుందన్నారు. సకల శుభాలను ఇచ్చే హనుమంతుని వ్రతాన్ని ఆచరించడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని వివరించారు.



నేటి నుంచి నందమూరు గరువులో ఉత్సవాలు ప్రారంభం

వీరవాసరం(భీమవరంటౌన్) డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వీరవాసరం మండలం నందమూరుగురువులోని రామ భక్త ఆంజనేయ స్వామివారి 59వ వార్షిక మహోత్సవం, శ్రీమనుమద్వ్రత మహోత్సవ ఉత్సవాలు శుక్రవారంనుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. 13వ తేదీ నుంచి ఈనెల 25 వతేదీవరకు 13 రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లును పూర్తిచేశారు. శుక్రవారం ఉదయం 5-45 నిమిషాలకు కొప్పినీడి శ్రీనివాసరావు, లక్ష్మి కృష్ణకుమారి దంపతులచే కలశస్థాపనతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. అనంతరం 8-30కు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)చేతుల మీదుగా స్వామివారి ఊరేగింపును ప్రారంభిస్తారు. రాత్రి 7 గంటలకు ఆలయం వద్ద భారీ బాణసంచా కాలుస్తారు. 15వతేదీన ఉదయం 5-30 నిమిషాలకు మేళతాళాలతో 108 కళశాలతో అభిషేకాలు, హనుమాన్ దీక్షాధారులతో మహాపూర్ణాహుతి ర్వహిస్తారు. ప్రతీరోజు ఆలయంవద్ద సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. 25 వతేదీన అఖండ అన్నసమారాధన నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద భారీ విద్యుత్ దీపాలంకరణ చేశారు.

పోలవరంలో వాటర్ బస్ ఏమైంది?

పోలవరం మండలంలో పర్యాటక అభివృద్ధికి 2017 సంవత్సరం ఏప్రిల్ నెలలో అప్పటి టీడీపీ ప్రభుత్వం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వాటర్ బస్సు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. గోవా నుంచి ప్రత్యేక వాహనంలో దీన్ని తీసుకువచ్చారు. గూటాల ఇసుక ర్యాంపు ప్రాంతంలో గోదావరి నదిలో బస్సు దిగడానికి ఒక ర్యాంపుని, పోలవరం గ్రామ శివారున ఏపీ టూరిజం బోటు పాయింట్ వద్ద మరో ర్యాంపుని నిర్మించింది. ఈ రోడ్డు కం వాటర్ బోటు రాజమహేంద్రవరం నుంచి రోడ్డు మార్గాన గూటాల చేరుకుని అక్కడి ర్యాంపు నుంచి నీటిలో ప్రయాణించి పోలవరం ఏపీ టూరిజం బోట్ పాయింట్ వద్ద ర్యాంపు నుంచి మళ్ళీ రోడ్డుపైకి చేరుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. అప్పట్లో ఆ బోటుతో ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. ఐతే గోదావరిలో నీటిమట్టం తగ్గి ఇసుక తిన్నెల వల్ల సమస్యలు ఏర్పడే అవకాశాలు ఉండడంతో నిలిపివేశారు. పోలవరంలో పర్యాటకం అభివృద్ధి చెందాలంటే ఆ రోడ్డు కం వాటర్ బస్సుని పోలవరం ప్రాజెక్టు స్పిల్వే మీదుగా పోశమ్మ గండి బోటు పాయింట్ ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడి నుంచి గోదావరిలో పర్యటించే విధంగా చర్యలు తీసుకుంటే పర్యాటకం పెరుగుతుందని పలువురు సూచిస్తున్నారు.

-పోలవరం



వాటర్ బస్సు కోసం ఏర్పాటు చేసిన ర్యాంపు



ఇదే వాటర్ బస్



మొదటిస్థానం సాధించిన ఆర్ట్స్ కాలేజీ..రెండోస్థానం సాధించిన గోపన్నపాలెం కాలేజీ క్రీడాకారులు

గోపన్నపాలెంలో ముగిసిన ఖోఖో పోటీలు

దెందులూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజులుగా జరుగు తున్న బాలికల ఇంటర్ మోరల్ ఖోఖో క్రీడా పోటిలు ముగిశాయి. మండలంలోని గోపన్నపాలెం శ్రీసీతా రామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో జరిగిన ఖోఖో పోటీల్లో మొదటిస్థానం రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ , రెండోస్థానం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల క్రీడాకారులు సాదించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియాల్ తెలిపారు. మూడో స్థానం తుని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ క్రీడాకారులు, నాల్గవ స్థానం రాజమండ్రి యునివర్శిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ కాలేజీ సాధించాయని తెలిపారు. ప్రిన్సిపాల్ నతానియాల్ కూటమి నాయకులతో కలిసి బహుమతులను అందజేశారు. సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కెక్కిన శ్రీజకు సత్కారం

కాళ్ళ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అ..ఆ..లు కూడా దిద్దడం రాని మూడేళ్ళ చిన్నారి దేశంలోని అన్ని రాష్ట్రాలు, వాటి రాజధానుల పేర్లు ఇంగ్లిషులో చెప్పడంతో పాటు మానవ శరీరంలోని అన్ని అవయవాల పేర్లను ఇంగ్లిష్‌లో చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించడంగర్వకారణమని దొడ్డనపూడి సర్పంచ్ కొల్లి సుబ్బారావు అన్నారు. కాళ్ళ మండలం దొడ్డనపూడి గ్రామంలో ఇటీవల 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు సంపాదించిన చిన్నారి కొల్లి జస్విక శ్రీజకు గురువారం గ్రామస్తులు అభినందన సభ నిర్వహించారు. చిన్నారితోపాటు తల్లి దండ్రులను అభినందించి సత్కారం నిర్వహించారు. అనంతరం గ్రామ సర్పంచ్ సుబ్బారావు మాట్లాడుతూ ప్రతిభను ప్రోత్సహించడానికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. శ్రీజకు సుమారు రూ. 25 వేలు విలువ గల ట్యాబ్ బహూకరించారు.



శ్రీజకు ట్యాబ్ అందిస్తున్న సర్పంచ్ సుబ్బారావు

రాష్ట్ర స్థాయి టాలెంట్ పోటీలకు నిమ్మ బాలాజీ ఎంపిక



పెంటపాడు డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : పిట్ట కొంచెం..కూత ఘనం రీతిన గ్రామీణ ప్రాంత విద్యార్థులు తమ సత్తా చాటుతున్నారు. గ్రామాల్లో పుట్టిపెరిగినా కార్పొరేట్ విద్యాసంస్థల విద్యార్థులను ఢీకొని ఆన్‌లైన్ పరీక్షా పోటీలలో తన సత్తా చాటాడు పరిమెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నిమ్మ బాలాజీశ్రీ మణికంఠ భారతీయ విజ్ఞాన మండలి వారి ఆధ్వర్యంలో కౌశల్-2024 టాలెంట్ సెర్చ్ పరీక్షలో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మణికంఠ జిల్లాస్థాయి ఆన్‌లైన్ పరీక్షలలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం కాంతిశ్రీ తెలిపారు. డిసెంబరు 29, 30 తేదీలలో విజయవాడలో జరగబోయే రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు అర్హత సాధించాడన్నారు. జిల్లా కోఆర్డినేటర్ శరత్‌చంద్ర, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

ఫుట్‌బాల్ కోచ్ కాశీ సుబ్బారావు మృతి

ఏలూరు రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ కోచ్‌గా 30 ఏళ్ళుగా సేవలు అందించి, ఇటీవల పదవీ విరమణ పొందిన ఏలూరుకు చెందిన కాశీ సుబ్బారావు అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. సుబ్బారావు అంత్యక్రియలు గురువారం జరిగాయి. అల్లూరి సీతారామ రాజు స్టేడియంలో పలువురు ఫుట్‌బాల్ కోచ్‌లు, ప్రముఖులు ఆయన అల్లుడు సినీ దర్శకుడు మలినేని గోపిచంద్, కుటుంబ సభ్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీ మాగంటి బాబు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్, కోచ్ సిరాదుద్దీన్, ఫుట్‌బాల్ అసోసియేషన్ నాయకులు, క్రీడాకారులు నివాళులర్పించారు.



సుబ్బారావు (ఫైల్ ఫొటో)



నివాళులర్పిస్తున్న సినీ దర్శకుడు మలినేని గోపీచంద్



సమావేశంలో మాట్లాడుతున్న డిజిటల్ టూల్స్ కో-ఆర్డినేటర్ మధుమంజరి

వీడియోకాల్ చేస్తే శాస్త్రవేత్తల సలహాలు

అగ్రికల్చరల్ డిజిటల్ టూల్స్ కో-ఆర్డినేటర్ మధుమంజరి

పెనుమంట్ర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతు పొలంలో ఆశించిన తెగుళ్ల వీడియో కాల్ ద్వారా చూపిస్తే వాట్సప్ ద్వారా రైతులకు సలహాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని అగ్రికల్చరల్ డిజిటల్ టూల్స్ కో-ఆర్డినేటర్ సౌత్ ఆసియా ప్రతినిధి మధు మంజరి తెలిపారు. గురువారం పెనుమంట్ర మండలం మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో వరి పంట సస్య రక్షణలో మార్గ దర్శకాలు అనే అంశంపై ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థాన ం, సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ టి.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాము రూపొందించిన సస్యరక్షణా సిఫార్సులను పూర్తి స్థాయిలో పరిశీలించి తెలుగు రాష్ట్రాలకు అనువుగా ఉండే విధంగా రూపొందిచినట్లయితే, ఇక్కడ పనిచేసే వ్యవసాయ అధికారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.శ్రీనివాస్ మాట్లాడుతూ వరి పంటను ఆశించే పురుగులు, తెగుళ్ళపై ఆన్లైన్‌లో పొందుపరిచిన సస్యరక్షణా సిఫారసులను, మనశాస్త్ర వేత్తలు పూర్తిగా పరిశీలించి, ఆంధ్రప్రదేశ్‌కి అనువుగా ఉండే విధంగా మార్పులు చేర్పులు చేయాలని, అంతేకాక వీటిని తెలుగు భాషలోకి అనువ దించడానికి ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తు న్నామని తెలిపారు. పూర్తి సమాచారం ఈనెల 26వ తేదీనాటికి కాబి వారికి అందజేస్తామన్నారు. తరువాత జరిగే శిక్షణా కార్య క్రమాల ద్వారా వ్యవసాయ అధికారులకు ఈ మొబైల్ ఆప్‌ల ద్వారా సమాచారాన్ని వినియోగించే అంశంపై అవగాహన కల్పిస్తారు.

నాటకం సజీవంగా ఉంటేనే సినీ రంగం బాగుంటుంది

వీరవాసరం (భీమవరం టౌన్) డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : "నాటక రంగం సజీవంగా ఉంటేనే సినీ రంగం బాగుటుంది. నేను కూడా నాటక రంగంనుంచే సినీ రంగంలో ప్రవేశించానని దర్శకత్వంలో నాకు దాసరి నారాయణరావు గురువు అని" సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. వీరవాసరం మండలం తోలేరు షష్ఠి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న సుబ్రహ్మణేశ్వర కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన 20వ జాతీయ స్థాయి నాటిక పోటీల బహుమతి ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేడు ఎంతో మంది కళాకారులు నటక రంగంనుంచే సినీ రంగంలోకి వచ్చి తమ ప్రతిభతో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని, అటువంటి నాటకరంగాన్ని కాపాడుకోవాలన్నారు. తనను ముగింపు సభకు రావాలని చవ్వాకుల సత్యనారాయణ ఆహ్వానించినపుడు చలన చిత్రరంగం హవా నడుస్తున్న పరిస్థితిలో నాటక రంగానికి ఆదరణపై ఎంక్వైరీ చేశానని ఇక్క డకు వచ్చిన తరువాత ప్రేక్షకులను చూస్తుంటే ఇంకా నాటక రంగానికి ఆదరణ ఉందని తెలిసిందన్నారు. శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు , కళాపరిషత్ సభ్యులు రేలంగి నరసింహారావును సత్కరించారు. విజేతలకు బహుమతులను అందించారు. గూడురు ఉమా బాల, కౌరు శ్రీనివాస్, గుండా రామకృష్ణ, చవ్వాకుల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఉత్తమ ప్రదర్శనగా నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత ?

ఉత్తమ ప్రదర్శనగా విశాఖపట్నం తెలుగు కళా సమితి ప్రదర్శించిన నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత? నాటకం దక్కించుకుంది.ఉత్తమ దర్శకత్వ చలసాని కృష్ణ ప్రసాద్‌కు దక్కింది. ఉత్తమ నటుడుగా కుమార్ పాత్రధారి పి.వరప్రసాద్, ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా హెడ్ కానిస్టేబుల్ పాత్రధారి రాంబాబుకు దక్కింది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి ఇంద్రప్రస్థం నిలిచింది. తృతీయ ఉత్తమ ప్రదర్శనగా పాలకొల్లు నటీనట సంక్షేమ సమాఖ్య వారు ప్రదర్శించిన అనూహ్యంకు దక్కింది. జ్యూరీ ప్రదర్శనగా కత్రిపాడు ఉషో దయ కళానికేతన్ వారి కిడ్నాప్ నాటికకు దక్కింది. ఉత్తమ రచన ఇంద్రప్రస్థం నాటికకు, ఉత్తమ నటిగా అనూహ్యం నాటికలోని వసుంధర పాత్రధారి జ్యోతిరాణికి దక్కింది. ఉత్తమ ప్రతినాయకుడుగా కిడ్నాప్ నాటికలో కోటేశ్వరరావు పాత్రధారి నడిపల్లి వెంకటేశ్వరరావుకు, ద్వితీయ ఉత్తమ నటుడు అనూహ్యంలో ఆనందరామయ్య పాత్రధారి ఎంవీ రాజర్షికి, ద్వితీయ ఉత్తమ నటి కమనీయం నాటికలో రాగసుధ రాజ్యం పాత్రధారి గుడివాడ లహరికి దక్కింది. ఉత్తమ రంగాలంకరణ స్వప్నం రాల్చిన అమృతం నాటికలో రాముకు దక్కింది. ఉత్తమ ఆహార్యం కిడ్నాప్ నాటికలో అమృత వర్షిణికి, ఉత్తమ సంగీతం ఇంద్రప్రస్థం నాటికలో లీలా మోహన్‌కు దక్కింది. జ్యూరీ అవార్డు అనూహ్యంలో రాజేష్ పాత్రదారి శ్యామ్ శేఖర్‌కు దక్కింది.



సినీ దర్శకుడు రేలంగి నరసింహారావును సత్కరించిన దృశ్యం

మామిడి, కొబ్బరిలకు బీమా

ప్రతికూల వాతావరణ పరిస్థితులతో నష్టపోతున్న రైతులు

మొదటిసారిగా మామిడి పంటకు..

కొబ్బరిలో సాగు అభివృద్ధి కోసం..

ఏలూరుసిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వాతావరణ ప్రతికూల పరిస్థితుల వల్ల మామిడి, కొబ్బరి పంటను సాగు చేసే రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితులను గమినించిన ప్రభుత్వం రెండు పంటలకు బీమా సౌకర్యం కల్పిస్తోంది. ముఖ్యంగా మామిడి రైతులను ఆదుకోవడానికి ఆ పంటకు మొదటిసారిగా బీమా కల్పిస్తున్నారు. జిల్లాలో 35 వేల ఎకరాల్లో మామిడి సాగు జరుగుతుండగా, 36 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతోంది.పంటల బీమా పొందడానికి ఖచ్చితంగా రైతులు తమ పంటను ఈ-పంటలో నమోదు చేసుకోవాలి.

మామిడి పంటకు బీమా ఇలా..


మామిడి పంటకు ఎకరానికి రూ.45 వేల వరకు నష్ట పరిహారం పొందవచ్చు. ఎకరానికి రూ.2,250 ప్రీమియం ఈనెల 15వ తేదీలోగా చెల్లించాలి. బీమా పొందడానికి మీ దగ్గరలో ఉన్న బ్యాంకు/ సీఎస్‌సీ/ లేదా రైతులే నేరుగా పీఎంఎఫ్‌బివై పోర్టల్‌లో మొబైల్ ద్వారా ప్రీమియం చెల్లించవచ్చు. బ్యాంకు అక్కౌంట్ జిరాక్స్, పాస్‌బుక్ జిరాక్స్ , పంట వేసినట్టు ధ్రువీకరణ పత్రాలను వీఏఏ/ వీహెచ్‌ఏ/ వీఎస్‌ఏలకు ఇవ్వాలి. బీమా వర్తింపులో 15/12/2024 నుంచి 28/2/2025 వరకు అకాల/అధిక వర్షపాతం, 1/1/2025 నుంచి 15/3/2025 వరకు చీడపీడల వాతా వరణం , ఉష్ణోగ్రతలలో వ్యత్యాసం, 1/3/2025 నుంచి 31/5/2025 వరకు అధిక గాలి అంశాలకు బీమా వర్తింపజేస్తారు.

నష్ట పరిహారం అంచనా..

15/12/2024 నుంచి 31/5/2025 మధ్యన అధిక వర్షపాతం, గాలిలో తేమ శాతం, వాతావరణం వ్యత్యాసం, గాలి వేగం సంబంధించిన పరిణామాలను మండల స్థాయిలో గల ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెలవప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ వాతావరణ పరికరాల సాయంతో లెక్కిస్తారు. దానిని ఈ పథకంలో ముందుగా పొందుపరచబడిన పరిణామాలలో సరిపోల్చినప్పుడు వచ్చిన తేడా ఆధారంగా నష్టపరిహారం చెల్లిస్తారని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎస్.రామ్మోహన్ తెలిపారు.

కొబ్బరి పంటకు ఇలా..

కొబ్బరి తోటలు సాగు చేసిన రైతులు వాతావరణ పరిస్థితులు వల్ల, చీడపీడలు వల్ల నష్టపోతే నష్ట పరిహారం పొందే అవకాశాలున్నాయి. కొబ్బరి సాగులో సంకర జాతి మొక్కలు 4 నుంచి 60 ఏళ్లు, పొడవు మొక్కలు 7 నుంచి 60 ఏళ్లు కలిగి ఉండాలి. రైతులు నష్టపరిహారం పొందడానికి ప్రీమియం సంవత్సరానికి చెట్టు ఒక్కింటికి (4 నుంచి 15 ఏళ్లు) రూ2.25, 16 నుంచి 60 ఏళ్లు చెట్టుకు రూ. 3.50 చెల్లించాలి. ఒకవేళ నష్టం కలిగితే 4 నుంచి 15 ఏళ్ల కొబ్బరి మొక్కలకు ఒక్కింటికి రూ.900, 16 నుంచి 60 ఏళ్ల వయసు కలిగిన మొక్కలకు ఒక్కింటికి రూ.1750 చొప్పున నష్టపరిహారం చెల్లిస్తుంది. సమాచారం కోసం ఏఐసీ రీజినల్ కార్యాలయం 86322 33565 నంబర్‌ను సంప్రదించాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి తెలిపారు.



భీమవరంలో 30 పడకల ఈఎస్‌ఐ ఆస్పత్రి

» ఆమోదం తెలిపిన ప్రభుత్వం » స్థలసేకరణ కోసం వెతుకులాట » ఆస్పత్రి నిర్మాణం జరిగితే సుమారు 2 లక్షల మందికి మేలు



భీమవరంలోని ఈఎస్‌ఐ ఆస్పత్రి

భీమవరం క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న కార్మికుల కల నెరవేరనుంది. పలు కంపెనీలు, ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులకు ఇక వైద్యం సులభతరం కానుంది. ఏదైనా తీవ్రమైన అనారోగ్యం వస్తే వైద్యం కోసం రాజమహేంద్రవరం లేకపోతే విజయవాడ వెళ్ళాల్సి వచ్చేది. త్వరలోనే కార్మికులకు ఆ ప్రయాస తగ్గనుంది. జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణంలో 30 పడకల ఈఎస్‌ఐ (ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్) ఆస్పత్రికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అయితే స్థల సేకరణ కోసం కొన్ని ఆక్వా కంపెనీలను, ఫ్యాక్టరీల యజమానులను అడుగుతున్నారు. స్థలసేకరణ పూర్తయితే ఆస్పత్రి నిర్మాణం ప్రారంభమవుతుంది. రాష్ట్రంలో ఒంగోలు, భీమవరం, అనంతపురం, కడప పట్టణాల్లో ఈఎస్‌ఐ 30 పడకల ఆస్పత్రులకు ఇటీవల కేంద్రం అనుమతి రావటంతో రాష్ట్ర ప్రభుత్వం ఆస్పత్రుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నది. అలాగే 18 డిస్పెన్సరీలు (సాధారణ వైద్యం) అందించే కేంద్రాలను కూడా ఏర్పాటు చేయనున్నారు.

జిల్లాలో 4 డిస్పెన్సరీలు మాత్రమే

పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, వేండ్ర డిస్పెన్సరీలు ఉన్నాయి. గతంలో పాలకొల్లులో ఉండేది. అలాగే ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు ఏలూరు, కొవ్వూరు, నిడదవోలు పట్టణాల్లో డిస్పెన్సరీలు ఉండేవి. అయితే ఏదైనా తీవ్రమైన అనారోగ్యం వస్తే మాత్రం రాజమహేంద్రవరం, విజయవాడ వెళ్ళేవారు. అంత దూరం వెళ్ళలేనివారు ప్రైవేట్ ఆస్పత్రుల్లో డబ్బులు చెల్లించి వైద్యం చేయించుకునేవారు. రాజమహేంద్రవరంలో 200 పడకల ఈఎస్‌ఐ ఆస్పత్రి కార్మికులకు సేవలు అందిస్తుంది. సుమారు 30 మంది వైద్యులు అక్కడ అందుబాటులో ఉన్నారు. అయితే కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు కూడా ఈఎస్‌ఐ కార్డు ద్వారా వైద్యం అందిస్తారు. అయితే కొన్ని రకాల రోగాలకు మాత్రమే చికిత్స అందిస్తారు.

కార్పొరేషన్ ద్వారా ఆస్పత్రి నిర్మాణం

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈఎస్‌ఐ సంస్థ ఏర్పాటు అయి ఉంది. ఆస్పత్రి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలం చూపిస్తే కార్పొరేషన్ ద్వారా ఆస్పత్రిని నిర్మిస్తారు. ఈఎస్‌ఐ ఉన్న కార్మికులు వారికి వచ్చే జీతాల్లోని కొంత సొమ్మును ప్రతి నెలా ప్రభుత్వం కోత విధిస్తుంది. ఆ సొమ్ములోని కొంత సొమ్మును కూడా ఆస్పత్రి నిర్మాణానికి వినియోగించి సేవలు అందించనున్నారు.

గతంలోనే ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణానికి ప్రతిపాదనలు

2014 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రావడంతోనే జిల్లాలో ఈఎస్‌ఐ ఆస్పత్రికి ప్రతిపాదనలు వచ్చాయి. తణుకులో ఆస్పత్రి నిర్మాణం ఏర్పాటు కోసం అప్పటి, ఇప్పుడు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వేల్పూరు రోడ్‌లో ఎకరం పద్నాలుగు సెంట్ల స్థలాన్ని కేటాయించారు. అయితే ఆ స్థలం పట్టణానికి దూరంగా ఉందని, మరికొన్ని కారణాలతో ఆస్పత్రి నిర్మాణం రద్దుచేశారు. మళ్ళీ ఇప్పుడు భీమవరంలో ఆస్పత్రి నిర్మాణానికి ప్రతిపాదనలు అందాయి.

జిల్లాలో సుమారు 2 లక్షల మందికి మేలు

పశ్చిమ గోదావరి జిల్లాలో సాధారణ వైద్యం అందించే నాలుగు డిస్పెన్సరీలు పరిధిలో కొన్ని వేల మంది కార్మికులు ఉన్నారు. భీమవరంలో 26 వేల మంది కార్మికులు, తణుకులో 16 వేలు, తాడేపల్లిగూడెంలో 6 వేలు, వేండ్రలో 200 మంది కార్మికులు ఈఎస్‌ఐ కార్డులు కలిగి ఉన్నారు. వీరి ద్వారా వారి కుటుంబ సభ్యులు తల్లి, తండ్రి, భార్య, పిల్లలు ఇలా సుమారు 2 లక్షల మంది వరకు 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు ద్వారా ఉన్నత వైద్యం పొందవచ్చు.



పట్టు చీర చూపుతున్న మినాక్షి చౌదరి

తాడేపల్లిగూడెంలో చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభం

సందడి చేసిన హీరోయిన్ మీనాక్షి చౌదరి

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో గురువారం చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా లక్కీభాస్కర్ సినిమా హీరోయిన్ మీనాక్షి చౌదరి సందడి చేశారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, విప్ బొలిశెట్టి శ్రీనివాస్, స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజి పలు విభాగాలు ప్రారంభించారు. నటి మీనాక్షి చౌదరి పట్టు చీరల విభాగం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీనాక్షి చౌదరి మాట్లాడుతూ సినీ పరిశ్రమలో తనను ఆదరిస్తున్న ప్రేక్షకులకు, తనకు అవకాశం ఇస్తున్న నిర్మాతలు, దర్శకులు, హీరోలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నై షాపింగ్‌మాల్ యాజమానులు జనార్దనరెడ్డి, మర్రి వెంకటరెడ్డి, ఆర్యవైశ్య సంఘ గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా కొనుగోలు దారులు హాజరై వస్త్రదుకాణంలో ప్రారంభోత్సవ ఆఫర్‌కు ఆకర్షితులయ్యారు. ముఖ్యంగా రూ.99లకే చీర ఆకట్టుకుంది.

కూటమి ప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారు

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

తాడేపల్లిగూడెం అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ అవినీతి పాలనలో భయపడుతూ జీవించిన ప్రజలు నేడు కూటమి ప్రభుత్వ పాలనలో స్వేచ్ఛగా జీవిస్తున్నారని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాయలంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) అధ్యక్షతన గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పట్టాభిరామ్ మాట్లాడుతూ దోచుకోవడమే ధ్యేయంగా గత వైసీపీ పరిపాలన సాగించారన్నారు. చివరకు పేదవారికి అందించే రేషన్, ఇసుక తదితర వాటిపై కూడా విపరీతంగా దోపిడికి పాల్పడ్డారన్నారు. అవినీతికి పాల్పడిన ఎవరినైనా ఉపేక్షించేది లేదని, వైసీపీకి చెందిన మాజీ సీఎం అయినా మాజీ మంత్రులు లేక మాజీ ఎమ్మెల్యేలు ఎంతటి వారైనా ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. గతంలో ఎవరైనా వ్యాపారాలు పెట్టుకోవాలన్నా భయపడుతూ ఉండే వారిని ప్రస్తుత ప్రభుత్వ హయాంలో స్వేచ్ఛగా వ్యాపారాలు సాగించేందుకు ముందుకు వస్తున్నారన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన చెన్నై షాపింగ్ మాల్ దీనికి నిదర్శనమన్నారు. టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి నేతృత్వంలో తాడేపల్లిగూడెం పార్టీ బలంగా ఉందన్నారు. పార్టీ కోసం శ్రమించిన బాబ్జికి త్వరలోనే మంచి పదవి వస్తుందని, దీనికోసం తాము కూడా తమ ప్రయత్నం చేస్తామన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ, బీజేపీల ఇన్‌చార్జులు వలవల బాబ్జి ఈతకోట తాతాజీ సమన్వయంతో తాడేపల్లిగూడెం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. అనంతరం పట్టాభిరామ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పరిమిరవికుమార్, గంధం సతీష్, పద్మనాభుని మురళి, ముత్యాల సత్యనారాయణ, ఎరుబండి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం ముసుగులో బ్లాక్ మెయిల్

కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన సర్పంచ్‌లు



సమాచార హక్కు కమిషనర్ సునీల్‌కుమార్‌ను కలసిన పాలకోడేరు సర్పంచ్‌లు

పాలకోడేరు, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): విలేకరినని చెప్పుకుంటూ అందినకాడికి దోచుకోవడమే కాకుండా సమాచార హక్కు చట్టం ముసుగులో ఎంతో మందిని ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న నిడమర్రు గ్రామానికి చెందిన రాంబాబుపై చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు (ఆర్.టి.ఐ.) కమిషనర్ చావలి సునీల్‌కుమార్‌ను పాలకోడేరు మండల సర్పంచ్‌లు కోరారు. విజయవాడ ఆర్‌టీఐ కార్యాలయంలో శృంగవృక్షం, విస్సాకోడేరు, పాలకోడేరు, వేండ్ర, గొరగనమూడి సర్పంచ్‌లు జంగం సూరిబాబు, బొల్లా శ్రీనివాస్, ఇంజేటి మరియమ్మ లక్ష్మీపతి, కడలి నాగేశ్వరి వీరబాబు, గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీరాజు), మాజీ సర్పంచ్ చెల్లబోయిన పాపారావు గురువారం సమాచార హక్కు కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు రాంబాబుకు సంబంధించిన కేసులు, సమాచార హక్కు దరఖాస్తుల వివరాలను తెలియజేశారు. గత రెండు నెలల నుంచి రాంబాబు పాలకోడేరు మండలంలో సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించుకుని ఇష్టానుసారంగా చట్టాన్ని దుర్వినియోగానికి పాల్పడుతున్నారని చెప్పారు. సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసి పంచాయతీల వద్ద సమాచారాన్ని తీసుకుని భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. డబ్బులు ఇవ్వకపోతే పంచాయతీల ద్వారా పొందిన సమాచారాన్ని ప్రసార మాధ్యమాల్లో పోస్ట్ చేయడమే కాకుండా తన అనుచరులతో పోస్టులను ఇతర గ్రూపుల్లో షేర్ చేస్తున్నారని ఆరోపించారు. మూడు జిల్లాల్లో సుమారు 200 దరఖాస్తులు సమాచార హక్కు చట్టం ద్వారా పెట్టడం ద్వారా వచ్చిన సమాచారాన్ని రాంబాబు తన ఆర్థిక ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాడని ఆరోపించారు. వివిధ పోలీస్ స్టేషన్లలో రాంబాబుపై సుమారు 13 కేసులు కూడా నమోదై ఉన్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఇప్పటికే గతంలో రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు. దీనికి స్పందించిన కమిషనర్ చర్యలు తీసుకుంటామని సర్పంచ్‌లకు హామీ ఇచ్చారు.

ఈపీసీహెచ్ దక్షిణాది సభ్యుడుగా తులసీ ఎన్నిక



తులసీని అభినందిస్తున్న చైర్మన్ దిలీప్ బాయిద్

నరసాపురం టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నరసాపురం లేసు ఉత్పత్తులకు దక్షిణాదిలో అరుదైన గౌరవం దక్కింది. ఇప్పటి వరకు ఈపీసీహెచ్ (ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ హ్యాండీక్రాఫ్ ఆఫ్ ఇండియా) కమిటీ మెంబర్ పదవిని తొలిసారిగా రాష్ట్రం నుంచి నరసాపురం ప్రాంతానికి చెందిన కలవ కొలను తులసీ దక్కించుకున్నారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఈపీసీ హెచ్ ఎన్నికల్లో తులసీ దక్షిణాది నుంచి పోటీ చేసి ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవిలో నాలుగేళ్ల కొనసాగుతారు. ప్రస్తుతం నరసాపురం లేసు ట్రేడింగ్ సెంటర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. లేసు ఎగుమతుల్లో ప్రభుత్వం నుంచి అనేక అవార్డులను అందుకున్నారు. దక్షిణాదిలోని హస్తకళలు, హ్యాండీక్రాఫ్ తదితర చేతి వృత్తుల్ని ప్రోత్సహించడం, శిక్షణ ఇవ్వడం, ఎగుమతులకు స్టాల్స్ ఏర్పాటు, కేంద్రం అందించే పథకాలను అర్హులైన మహిళలకు వర్తింప జేయడం వంటి పనులను ఆయన పర్యవేక్షిస్తారు. ఈసందర్భంగా తులసీ మాట్లాడుతూ నరసాపురం ప్రాంతంలో లేసు, ఎంబ్రాయిడింగ్, డిజైనింగ్, కుట్టు అంశాల్లో శిక్షణ, ప్రోత్సాహం అందిస్తామన్నారు

సర్పంచ్ ఫిర్యాదుపై ఈవోపీఆర్డీ విచారణ

కాళ్ళ, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): కాళ్ళ గ్రామ పంచాయతీ మాజీ కార్యదర్శి పంచాయతీ సొమ్మును సొంతానికి వాడుకుని దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ సర్పంచ్ బందా విజయ తన భర్తతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన ఫిర్యాదుపై గురువారం కాళ్ళ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈవోపీఆర్‌డీ ఎంవీ భాస్కరరావు సమక్షంలో చేపట్టిన విచారణలో మాజీ కార్యదర్శి శివాజీ తాను ఏ విధమైన అవినీతికి పాల్పడలేదంటూ తాను చేసిన పనులకు సంబంధించిన బిల్లులను చూపించారు. అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సందర్భంగా 2022 జూలైలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కాళ్ల మండలం పర్యటన సందర్భంగా యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులను చేపట్టడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా ఎవరెవరికి ఎంతెంత చెల్లించామనేది అధికారుల కౌంటర్ సంతకాలు, సప్లయ్ దారుల సంతకాలు, ఎన్ఎంఆర్ అటెండెన్స్ అన్నీ సమర్పించినట్లు తెలిపారు. దీనిపై ఆడిట్ జరిగినట్లు కూడా స్పష్టం చేశారు. సదరు రిపోర్టు అంశాలను ఉన్నతాధికారులకు సమర్పించినట్లు ఈవోపీఆర్‌డీ స్పష్టం చేశారు.

రాజమండ్రి టూ న్యూఢిల్లీ

ఇండిగో విమాన సర్వీసులు ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



మధురపూడిలో ఢిల్లీకి నూతన సర్వీసును ప్రారంభించి కేక్ కట్ చేసి ఎంపీ పురందేశ్వరికి అందజేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

కోరుకొండ, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి నూతనంగా విమాన సర్వీసు ప్రారంభించడం ద్వారా ఇన్నాళ్లకు ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. న్యూఢిల్లీ రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి నేరుగా గురువారం ఉదయం 9 గంటలకు 6ఈ364 ఇండిగో విమాన సర్వీసు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంది. నియమాలను అనుసరించి నీటిని వెదజల్లి నూతన విమాన సర్వీసుకు స్వాగతం పలికారు. ఈ తొలి విమాన సర్వీసులోనే ప్రయాణికులతో కలిసి న్యూఢిల్లీ నుంచి రాజమహేంద్రవరం చేరుకున్న కేంద్ర విమానయానశాఖా మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఢిల్లీ నుంచి బయల్దేరి వచ్చిన ఈ తొలి విమాన సర్వీసుకు మధురపూడి విమానాశ్రయం వద్ద రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయశ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, జ్యోతుల నెహ్రూ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర్‌లు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాజమండ్రి విమానాశ్రయం వద్ద కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి రాజమండ్రి నుంచి న్యూఢిల్లీకి వెళ్లే నూతన విమాన సర్వీసును ఉదయం 9.45 గంటలకు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ రాజమహేంద్రవరం విమానాశ్రయం అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి మాట్లాడుతూ మొట్టమొదటి అడుగుగా రాజమండ్రి నుంచి దేశ రాజధాని ఢిల్లీకి నూతన ఎయిర్‌బస్ కల్పించిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీదేనన్నారు. త్వరలో గోదావరి పుష్కరాలు రానున్న నేపథ్యంలో రాజమహేంద్రవరానికి యావత్తు భారతదేశానికి విమాన సర్వీసులు అవసరమయ్యే ఆవశ్యకత ఉందన్నారు. అలాగే రాజమహేంద్రవరం నుంచి తిరుపతి, వారణాసి, షిరిడి వంటి నగరాలకు విమాన సర్వీసులు నడిపేలా కేంద్ర మంత్రి కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రయాణికులతో మధురపూడి విమానాశ్రయం నుంచి బయల్దేరిన ఇండిగో నూతన విమాన సర్వీసు మధ్యాహ్నం 12 గంటలకు న్యూఢిల్లీకి వెళ్లింది. కాగా ఈనెల 1న వాణిజ్య రాజధాని ముంబైకి విమాన సర్వీసు ప్రారంభమైన సంగతి తెలిసిందే.

జనవరి 15, 22 తేదీల్లో శబరిమలైకు ప్రత్యేక రైలు

నరసాపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 15, 22 తేదీల్లో నరసాపురం నుంచి శబరిమలైకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు ఎస్ఎం మధుబాబు చెప్పారు. జనవరి 15వ తేదీ రాత్రి 9గంటలకు 07183 నెంబర్‌తో నరసాపురంలో బయలుదేరి 17వ తేదీ ఉదయం 5.30గంటలకు కొల్లం చేరుకుంటుం దన్నారు. తిరుగు ప్రయాణంలో 07184 నెంబర్‌తో కొల్లంలో 17, 24 తేదీల్లో శుక్రవారం ఉదయం 8.40కు బయలుదేరి శనివారం సా యంత్రం 6.30కి నరసాపురం చేరుకుంటుంది. ఈ రైలు పాలకొల్లు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుంటూరు, రేణుగుంట, జలారు పేట, కొట్టాయం మీదుగా కొల్లం వెళుతు ందన్నారు

నరసాపురం సబ్ రిజిస్ట్రార్ ఎంవీటి ప్రసాద్ సస్పెన్షన్

నరసాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నరసాపురం ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఎంవీటీ ప్రసాద్ గురువారం సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. గతంలో ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా రిజిస్ట్రేషన్ చేసుకునే వెలుసుబాటు కల్పించింది. దీన్ని ఆసరాగా చేసుకుని గుంటూరు జిల్లాలో వివాదంలో ఉన్న భూమిని ప్రసాద్ రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై బాధితులు అమరావతిలోని రిజిస్ట్రేషన్‌శాఖ ఉన్నతాధికారుల్ని కలిసి ఫిర్యాదు చేశారు. విచారణలో వాస్తవం తేలడంతో సస్పెండ్ చేసినట్లు తెలిసింది. గతంలో ఆయన నరసాపురంలో పని చేశారు. ఆ సమయంలో కూడా సస్పెండ్ అయ్యారు. వివాదంలో ఉన్న భూమిని నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో రిజిస్ట్రేషన్ అప్పట్లో విచారణ జరిపించి వాస్తమని తేలడంతో సస్పెండ్ చేసింది. తాజాగా రెండోవ సారి కూడా ఆయన నరసాపురంలోనే సస్పెండ్ అవ్వడం గమనార్హం.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు



ఆక్రమణలకు మార్కింగ్ ఇస్తున్న సిబ్బంది

గణపవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గణపవరంలో ఆర్‌అండ్‌బీ రహదారుల ఆక్రమణల తొల గింపునకు అధికారులు నడుం బిగించారు. మూడు రోజులుగా మండలంలోని గణపవరం, సరిపల్లె, పిప్పరలోని ఆక్రమణలు తొలగించడానికి ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించి ఆక్రమణల గుర్తించారు. గురువారం గణపవరం పట్టణంలోని గణపవరం, భీమవరం, గణపవరం, ఏలూరు రహదారి గణపవరం-ఏలూరు రహదారి, గణపవరం-తాడేపల్లిగూడెం రహదారుల్లో సర్వే నిర్వహించి ఆక్రమణలకు మార్కింగ్ ఇచ్చారు. గణపవరంలోని ఈ మూడు ప్రధానరోడ్లు ఆక్రమణలకు గురయ్యాయి. డ్రైనేజీ పూడ్చివేసి రోడ్లు మార్జిన్‌లు ఆక్రమించి షెడ్లు నిర్మించి కొందరు వ్యాపారాలు చేస్తున్నారు.గణపవరంలో ఈ ఆక్రమణలు తొలగించాలన్న డిమాండ్ మూడు దశా బ్దాలుగా వినిపిస్తోంది. ఈ నెల 14న నీటి సంఘాల ఎన్నికలు ఉండటంతో అది పూర్తయిన అనంతరం ఆక్రమణల తొలగించే కార్యక్రమాన్ని ప్రారంభి స్తామని తహసీల్దార్ అప్పారావు తెలిపారు.

క్రైమ్ కార్నర్

తిరుమల దర్శనం టిక్కెట్ల పేరుతో రూ.37వేల టోకరా

నరసాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దర్శనం టిక్కెట్లు ఇప్పి స్తానంటూ ఆన్‌లైన్‌లో కేటుగాడు రూ. 37,500 కొట్టేశాడు. గురువారం నమోదైన ఈకేసుకు సంబంధించిన సీఐ యాదగిరి తెలిపిన వివ రాలు ప్రకారం.. పట్టణానికి చెందిన జి.శ్రీకాంత్ పవన్ రెడ్డి నాయుడు ఆన్‌లైన్‌లో తిరుమల దర్శనం కోసం ప్రయత్నించాడు. అయితే టిక్కెట్లు దొరకలేదు. కొద్దిసేపటికి అతని ఫోన్ నెంబర్‌కు కాల్ వచ్చింది. మీరు ప్రయత్నించిన వస్త్రాలంకరణ దర్శనం ఇప్పిస్తానని నమ్మబలి కాడు. అయితే ఒక్కొక్కరికి రూ.12,500 అవుతుందని, దర్శనానికి వెళ్లే సమయంలో మీకు ఎటువంటి ఇబ్బందిరాదని నమ్మించాడు. డబ్బులు యూపీఐ ద్వారా పంపండి, టిక్కెట్లు మీ వాట్సప్ నెంబర్‌కు పంపిస్తాని నమ్మించాడు. అతని మాటలు నమ్మి వెంటనే శ్రీకాంత్ అకౌంట్‌లోంచి రూ.37,500 గూగూల్‌పే చేశాడు. డబ్బు చేరిన మరుక్షణం మోస గాడు ఫోన్‌ను స్విచ్‌ఆఫ్ చేశాడు. ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో మోస పోయనని గ్రహించి పోలీసుల్ని ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి ఫోన్ నెంబర్, బ్యాంకు అకౌంట్ ఆధారంగా దర్యాప్తు చేపట్టామన్నారు. ఇటువంటి కాల్స్‌ను ఎవరూ నమ్మొద్దని సీఐ కోరారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

పాలకోడేరు, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): అనుమానంతో భార్యను కొట్టడంతో ఆమె చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పాలకోడేరు పోలీసులు తెలిపారు. మోగల్లు గ్రామానికి చెందిన చదలవాడ సుశీల (54) ను ఆమె భర్త గంగరాజు అక్టోబర్ 29న భార్యపై అనుమానంతో ఆమెను తీవ్రంగా గాయపర్చాడు. దీంతో సుశీల తీవ్ర గాయాలపాలవ్వడంతో ఆమెను కుటుంబ సభ్యులు విజయవాడ ఆస్పత్రికి తరలించారు. ఈ కేసులో మనుమరాలు సౌజన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు గంగరాజును అప్పట్లోనే అరెస్ట్ చేశారు. అయితే ఆమె గురువారం మృతి చెందడంతో ఆ కేసును మర్డర్ కేసుగా ఆల్టర్ చేసి గంగరాజుపై మర్డర్ కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్ఐ మంతెన రవివర్మ తెలిపారు.

తొమ్మిది మంది విద్యార్థులకు అస్వస్థత

» వికటించిన మధ్యాహ్న భోజనం » నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలింపు

» కోటపాడు ఎంపీయూపీ స్కూల్‌లో ఘటన



చికిత్స పొందుతున్న విద్యార్థులు

చాట్రాయి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా చాట్రాయి మండలం కోటపాడు ఎంపీయూపీ స్కూల్‌లో గురువారం మధ్యాహ్న భోజనం తిన్న 9 మంది విద్యార్థులు కడుపు నొప్పి, వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్న భోజనం తిన్న తరువాత 4వ తరగతి విద్యార్థులు టి.సిరి స్పందన, ఎస్.ఉదయ్ కుమార్, టి.వర్షిణి, 5వ తరగతి విద్యార్థులు ఎస్.కల్పన, ఎస్.అమృత, ఎస్.లాస్య, 7వ తరగతి విద్యార్థులు టి.కాంతి మేఘన, టి.ఉమా యశ్వంత్, మంచిన దుర్గా మనీష్ కడుపు నొప్పితో కొందరికి వాంతులు అవుతుండటంతో ఉపాధ్యాయులు వెంటనే ఎంఈవో బ్రహ్మచారికి , పీహెచ్‌సీ వైద్యులకు సమాచారం ఇచ్చారు. స్కూల్‌కు చేరుకున్న వైద్యాధికారి దుర్గాప్రసాద్ నూజివీడు ఏరియా ఆసుపత్రికి పంపారు. నూజివీడులో చికిత్స అనంతరం విద్యార్థులకు ప్రమాదం తప్పింది. బంగాళా దుంప కూరలో రాగి పిండి కలపటం వలన తమ పిల్లలకు ఈ పరిస్థితి వచ్చిందని తల్లిదండ్రులు తెలిపారు. కోటపాడు సర్పంచ్ పరసా సత్యనారాయణ నూజివీడు ఆసుపత్రికి వెళ్ళి పిల్లలకు వైద్య సేవలు అందే విధంగా కృషి చేశారు.

వ్యాను ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి



కలిదిండి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బొలెరో వ్యాన్ ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి చెందిన ఘటన భాస్కరావుపేటలో జరిగింది. కలిదిండి మండలం భాస్కరావుపేటకు చెందిన ముద్దం బ్రహ్మజీ కుమారుడు శామ్యూల్ మోజెస్ (17) ఏలూరుపాడులో ఇంటర్ చదువుతున్నాడు. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో భాస్కరావుపేట - మట్టగుంట రోడ్డుపై బహిర్భూమికి వెళ్తుండగా వ్యాన్ ఢీకొనడంతో శామ్యూల్ మోజెస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేతికందిన కొడుకు దుర్మరణం చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల తనిఖీలు

ఏలూరు క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ కెపిఎస్ కిశోర్ ఆదేశాల మేరకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. సరైన రికార్డులు లేనివారికి జరిమానాలు విధించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదంలో ఎక్కువ శాతం మంది హెల్మెట్ లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చునని సూచించారు.

తాళాలు వేసిన ఇళ్లల్లో చోరీలు

ఏలూరు క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తాళాలు వేసిన ఇళ్ళను ఒక దొంగ రెక్కీలు నిర్వహించి చివరకు రెండు ఇళ్ళ తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డాడు. ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రప్రస్థలో ఒక దొంగ బుధవారం అర్ధరాత్రి 1.20 గంటలకు ప్రవేశించాడు. వరుసగా ఇళ్ళను చూసుకుంటూ వెళ్ళాడు. తాళాలు వేసి ఉన్న రెండు ఇళ్ళ తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డాడు. ఇంద్రప్రస్థలో నివాసం ఉంటున్న అనుమళ్ళ భరత్‌రెడ్డి, ఆ పక్కనే నివాసం ఉంటున్న మొగలపు భరత్ ఇళ్ళ తాళాలను ఆ దొంగ పగులగొట్టి చోరీకి పాల్పడ్డాడు. ఈ సమాచారం అందుకున్న త్రి టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు, ఎస్ఐ కె ప్రసాద్, వారి సిబ్బంది క్లూస్ టీమ్ పరిశీలించారు. మరోవైపు ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజిలను పరిశీలించారు. మొత్తం మీద నేరస్తులను గుర్తించినట్లుగా సమాచారం. ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఒక ఇంట్లో కాసున్నర చైన్ పోగా, అర కేజీ వెండి వస్తువులు అపహరణకు గురికాగా, మరో ఇంట్లో రెండు కాసులు నల్లపూసల తాడు, ఒక కాసు బ్రాసిలెట్, అర కాసు ఉంగరం అపహరణకు గురయ్యాయి. మొత్తం ఐదు కాసుల బంగారు ఆభరణాలు, అరకేజీ వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదులు అందడంతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నరసాపురం టౌన్: పట్టణంలోని 28వ వార్డులో గురువారం తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై ముత్యాలరావు వివరాల ప్రకారం.. బందెల రూత్తమ్మ ఇంటికి తాళం వేసి గత నెల 17న కుమార్తె ఇంటికి వెళ్లింది. తిరిగి ఉదయం ఇంటికి వచ్చే సరికి తాళం పగలగొట్టిఉంది. సామగ్రి చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. వంటగదిలో కాగితాలు తగలబెట్టి ఉన్నాయి. బీరువాలో దాచిన 30తులాల వెండి, 28గ్రాముల బంగారాన్ని దోచుకుపోయారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

అప్పుల బాధతో ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

పెదవేగి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. వంగూరు గ్రామానికి చెందిన సువ్వా కల్యాణ్ తాపీ పని కార్మికుడు. అతను అప్పులపాలై, కొద్దిరోజులుగా మానసికంగా బాధపడుతున్నాడు. ఈ తరుణంలో గురువారం తాపీ పనికి కూడా వెళ్ళకుండా మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చీరతో సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పని నుంచి ఇంటికి వచ్చిన తల్లి కృష్ణవేణి కుమారుడు గదినుంచి ఎంతకూ బయటకు రాకపోవడం, పిలిచినా పలుకకపోవడంతో తలుపులు పగులగొట్టి చూడగా, ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. చుట్టుపక్కలవారి సాయంతో కిందకు దించగా అప్పటికే కల్యాణ్(27) మృతిచెందినట్లు గుర్తించారు. దీనిపై కల్యాణ్ తల్లి కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.



లునానిని సత్కరించిన కళాశాల యాజమాన్యం

ప్రాచీన భారత విద్య యోగా

ఏలూరు అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శరీరం, మనసు మధ్య సమతుల్యతను కల్పించే ప్రాచీన భారతీయ విద్య యోగా అని పారిశ్రామికవేత్త వేణుగోపాల్ లునాని అన్నారు. సీఆర్ఆర్ పీజీ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. ఆరోగ్యం, మానసిక ప్రశాంతతను మెరుగుపర్చడంలో యోగా గొప్పపాత్ర పోషిస్తుందన్నారు. నిత్యం యోగా సాధనవల్ల దైనందిన జీవితంలో చైతన్యం, సానుకూలత, రోగ నిరోధకశక్తి పెంపొందుతాయన్నారు. నాడీశోధన, నాడీశుద్ధి, ప్రాణాయామం, ధ్యానం చేయడం విద్యార్థులకు నేర్పించారు. వేణుగోపాల్ లునానిని కళాశాల యాజమాన్యం సత్కరించింది. కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రామరాజు, పీజీ కోర్సుల డైరెక్టర్ యలమర్తి సతీష్‌బాబు, ఆర్.శ్రీనివాసరావు, టి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

18న ఉచిత వైద్య శిబిరం

ఏలూరు టూటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బడేటి శ్రీహరిరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అమ్మానాన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మారం హనుమంతరావు (అనూ) తెలిపారు. నేత్రాలు, గుండె, పళ్ళకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారు. ఈసీజీ, 2డీఏకో పరిక్షలు ఉచితంగా నిర్వహిస్తారని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రానికి దారి

చింతలపూడి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతంపల్లిలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో సర్పంచ్ టి.రామకృష్ణ గ్రామ ప్రజల అభ్యర్థనతో అంగన్‌వాడీ కేంద్రం దారి సమస్యకు పరిష్కారం లభించింది. తహసీల్దార్ ప్రమద్వర మాట్లడుతూ పట్టాదార్ పాస్ పుస్తకాలు, అడంగళ్‌లో పేరు తప్పులు, సర్వే, రీసర్వే, భూతగాదాలు, పుంతదారి ఆక్రమణ సమస్యలు సదస్సు దృష్టికి తెస్తే తక్షణ పరిష్కారం చూపిస్తామన్నారు. దీంతో సర్పంచ్ రామకృష్ణ, కూటమి నాయకులు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం దారి సమస్య వివరించారు. సమస్య పరిష్కారంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

రైతుల కోసమే పొలం పిలుస్తోంది

చింతలపూడి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ, అనుబంధ శాఖలతో రైతులకు కావాల్సిన సమాచారం, సహాయం అందించడమే పొలం పిలుస్తోంది కార్యక్రమం అని ఏవో మీనాకుమారి అన్నారు. వరిపై తెగుళ్ళ నివారణకు, పురుగుమందుల వినియోగంపై సూచనలు ఇచ్చారు. వర్షాల సమయంలో ప్రస్తుతం ప్రభుత్వం రైతులకు టార్పాలిన్‌లను ఇస్తుందని, ధాన్యం తరలించే సమయంలో నాణ్యమైన గోనె సంచులు ఇస్తామన్నారు. బోడా నాగభూషణం, రాజరత్నం, హనుమంతరావు, అనీష్‌కుమార్, శ్రీను పాల్గొన్నారు.

25 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు చర్యలు

కామవరపుకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాడిచర్లలో 25 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని తాడిచర్ల సర్పంచ్ పసుమర్తి పార్థసారథిబాబు తెలిపారు. విగ్రహ ఏర్పాటు పనులను గురువారం పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఆయన వెంట స్థానికులు వేముల హనుమంతు, పాకలపాటి సత్యనారాయణ, జోనుబోయిన అబ్బులు, యలమర్తి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బోదకాలు నివారణకు చర్యలు

లింగపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో బోదకాలు వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ధర్మాజీగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి యానీప్రీతి అన్నారు. ధర్మాజీగూడెం పీహెచ్‌సీ పరిధిలో గురువారం రాత్రి గ్రామస్తుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో ప్రజలలో చైతన్యం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్‌ఏ ప్రసాద్, పార్థసారధి, ప్రసాద్, చరిష్మా, ధనలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

బాలిక వైద్యానికి రూ.50 వేలు సాయం

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టి.నరసాపురం మండలం అప్పలరాజుగూడెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ బొల్లాసాయి కుమార్తె ఉడుకుతున్న అన్నం కుండలో పడిపోయింది. తీవ్ర గాయాలతో విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పేద కుటుంబం కావడంతో రోటరీక్లబ్ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ దాకారపు కృష్ణ రూ.50వేలు గురువారం విజయవాడ వెళ్ళి బాలిక తల్లిదండ్రులకు అందజేశారు. జంగారెడ్డిగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి వైద్య సేవలందిస్తామన్నారు. బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికల సమావేశం

జీలుగుమిల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికల్లో కూటమి నాయకులు కలసికట్టుగా ఉండాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. ఏడు మండలాల కూటమి నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. నాయకులంతా కలసి సంఘం అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలన్నారు. అభివృద్ధికి కృషి చేసి నియోజకవర్గానికి తగిన గుర్తింపు తేవాలన్నారు. గడ్డమణుగు రవికుమార్, కరాటం సాయి, సుంకవల్లి సాయి, పసుపులేటి రాము, అడప నాగరాజు పలు మండలాల నాయకులు ఉన్నారు.



అన్నదాతల్లో అలజడి

మబ్బుల వాతావరణంతో రైతుల ఉరుకులు పరుగులు

ఏలూరు రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరి పంట చేతికందే వేళ మారిన వాతావరణంతో రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. అల్పపీడన ప్రభావంతో ఆకాశం మేఘావృతం కావడంతో పాటు రెండు రోజుల పాటు వర్షాలు పడతాయన్న వాతావరణ హెచ్చరికతో మరింత ఆందోళన పెంచింది. భారీవర్షాలు పడితే నష్టపోతామని రైతులు కలవర పడుతున్నారు. వరి మాసూళ్లు జరుగుతున్న నేపథ్యంలో ప్రతికూల వాతావరణం రైతులకు కంటిపై కునుకు లేకుండా చేస్తుంది. అష్టకష్టాలు పడి సాగు చేసిన పంట ఇంటికి తెచ్చుకునే వేళ ఇబ్బందులు తప్పడం లేదు. ఏలూరు రూరల్ మండలంలో రైతులు ధాన్యం రాశులను ఆరబెట్టుకునే పనిలో ఉన్నారు. కొందరు కోత యంత్రాలతో మాసూలు చేస్తున్నారు. మండలంలో 16వేల హెక్టార్లలో వరిసాగు చేపట్టారు. ప్రస్తుతం 6,500 ఎకరాల్లో కోతలు పూర్తి కాగా ధాన్యం రాశులు, కల్లాల్లో ఉన్నాయి. అధిక విస్తీర్ణంలో పంట కోతకు సిద్ధంగా ఉంది. అక్కడక్కడ కల్లాల్లో ధాన్యం ఉండడంతో వాతావరణం వణుకు పుట్టిస్తోంది. వర్షం పడితే కల్లాల్లో ధాన్యం తడిచిపోయే ప్రమాదం ఉందని, వరి నేలనంటి తడిస్తే రంగు మారుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

వనరులను సద్వినియోగం చేసుకోవాలి

సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి శిక్షణ



సూచనలిస్తున్న ఏపీ గ్రామీణాభివృద్ధి సంస్థ జేడీ రమణ

పెదవేగి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకుని పంచాయతీలు బలోపేతం కావాలని ఏపీ గ్రామీణాభివృద్ధి సంస్థ జేడీ రమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. రమణ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధి స్థానిక వనరుల వినియోగంపై ఆధారపడి ఉందన్నారు. వనరులను సక్రమంగా వినియోగిస్తూ భవిష్యత్ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎంపీడీవో పి.శ్రీనివాస్, ఏపీఎం ఏసురత్నం, అంగన్‌వాడీ పెదవేగి సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి, పది గ్రామాల సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: గ్రామాల సుస్థిర అభివృద్ధి అధికారుల సమిష్టి కృషితో సాధ్యమని ఎంపీడీవో వెన్నా శ్రీలత అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. మాస్టర్ ట్రైనీ మెప్మా ఏడీ నాగేశ్వరరావు, స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక భద్రత అంశాలు వివరించారు. సర్పంచ్‌లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని ఎంపీపీ రాంబాబు అన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పంచాయతీల పరిధిలో బడ్జెట్ ప్రణాళిక అమలుతో సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో మురళీకృష్ణ, పీఆర్ ఏఈ జగన్నాథం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికపై ఎంపీడీవో జి.రాజ్ మనోజ్, ఈవోపీఆర్‌డి చంద్రశేఖరన్ శిక్షణ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి ప్రజాప్రతినిధి చిత్తశుద్ధితో పనిచేయాలని వారు కోరారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, కార్యదర్శులు సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

● లింగపాలెం: గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు, సుస్థిర పరిపాలనకు అధికారులు, పజాప్రతినిధులు భాగస్వాములవ్వాలని ఈవోపీఆర్డీ జేఎం రత్నకుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ సర్పంచ్‌లు, ఐసీడీఎస్, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జేఎం రత్నకుమార్ వారికి అవగాహన కల్పించారు. గ్రామాల్లో పారిశుధ్యంతో పాటు బాలికల రక్షణ చట్టంపై అవగాహన కలిగించాలన్నారు. సర్పంచ్‌లు, ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● నిడమర్రు: గ్రామ పంచాయితీలు నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని ఎంపీడీవో విజయకుమారి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు రెండు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బాలల హక్కులు, సంక్షేమంపై అవగాహన



మాట్లాడుతున్న డీసీపీవో సూర్యచక్రవేణి

ఏలూరు క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులు, సంక్షేమ పథకాలు, చట్టాలను జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్ సూర్య చక్రవేణి వివరించారు. అమలోద్భవి ఇంగ్లీషు మీడియం హైస్కూలు విద్యార్థులకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలలకు ఎటువంటి సమస్య వచ్చిన చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి కాల్ చేయవచ్చన్నారు. సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బార్ అసోసియేషన్ ప్యానెల్ అడ్వకేట్ కూన కృష్ణారావు మాట్లాడుతూ బాలలపై లైంగిక వేధింపులు నివారణ చట్టం, సెల్‌ఫోన్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రస్తుత సమాజంలో స్థితిగతులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమలోద్భవి స్కూలు హెచ్‌ఎం సిస్టర్ నిర్మల, సీవీ.రమణ మాట్లాడు తూ పిల్లలు సమాజంలో జరుగుతున్న మా ర్పులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీసీపీయూ సిబ్బంది రాజేష్, వై.రాజ్‌కుమార్, టీచర్లు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బిషప్ జాన్ ములగడ సేవలు ఎనలేనివి



జాన్ ములగడకు నివాళులర్పిస్తున్న కరస్పాండెంట్

పెదవేగి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల వ్యవస్థాపకులు, ఏలూరు పీఠాధిపతి స్వర్గీయ బిషప్ జాన్ ములగడ పేదల అభ్యున్నతికి చేసిన సేవలు ఎనలేనివని కళాశాల కరస్పాండెంట్ పాదర్ జి.మోజెస్ అన్నారు. దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో బిషప్ జాన్ ములగడ 87వ జయంతి కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్ ఆధ్వర్యంలో జాన్ ములగడ విగ్రహానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఫాదర్ మోజెస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ఏకైక లక్ష్యంతో దుగ్గిరాలలో దంత వైద్య కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. ఆయన చూపిన బాట నేడు ఎంతోమందికి మార్గదర్శకమైందని అన్నారు. సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో దంతవైద్య కళాశాల ఏవో ఫాదర్ ఫిలిప్స్, వైస్ ప్రిన్సిపాల్ అనూరాధ, నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి.జాకబ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు

ఎమ్మెల్యే బడేటి చంటి



మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్నవారందరికి పింఛన్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తరచు అనారోగ్యకారణాలు, పింఛన్ సమస్యలతో ప్రజలు వస్తున్నారన్నారు. అనారోగ్య పరిస్థితులు ఉన్నవారికి ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందిస్తామన్నారు. కొంతమంది అర్హతలున్నప్పటికి పింఛన్ మంజూరు చేయడంలేదని ఫిర్యాదు చేస్తున్నారన్నారు. తప్పనిసరిగా పింఛన్ ఇప్పించే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. వివిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించేవిధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వారికి పింఛన్లు పెంచే ఆలోచన చేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు అవకతవకలు లేకుండా పారదర్శకంగా అమలు చేస్తున్నామన్నారు. నిష్పక్షపాలన అందించటమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో బీ.కిషోర్, ఎస్.చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

భీమడోలు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పోలసానపల్లిలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. కృష్ణంరాజు క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో పత్సమట్ల ధర్మరాజు, గన్ని వీరాంజనేయులను గురువారం సత్కరించారు. ధర్మరాజు, గన్ని మాట్లాడుతూ క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పొత్తూరి వాసురాజును నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధికి ప్రధానమంత్రి మోదీ, చంద్ర బాబు, పవన్ కల్యాణ్ నాయకత్వంలో ఎన్‌డీఏ కూటమి చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన డి.గోపవరం సర్పంచ్

నిడమర్రు డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలు, విధానాలు మెచ్చి పలువురు జనసేన పార్టీలో చేరడం శుభసూచకమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. డి.గోపవరం సర్పంచ్ తుమ్మూరి వెంకట నారాయణమ్మ, తుమ్మూరి కృష్ణారావు దంపతులు, ఉప సర్పంచ్ చోడగిరి ఫణి చంద్రిక, నాగబాలు, తుమ్మూరి శ్రీను, సుమారు 200 మంది కార్యకర్తలు, మహిళలు గురువారం జనసేనలో చేరారు. తుమ్మూరి కృష్ణారావు వెంకట నారాయణమ్మ దంపతులకు ఎమ్మెల్యే ధర్మరాజు జనసేన కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రం ప్రగతి, ప్రజా సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. పార్టీలో చేరికలు ప్రభుత్వంపై ప్రజలకు గల నమ్మకాన్ని తెలియజేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బలే శ్రీనివాస్, వార్డు మెంబర్ బలే వినాయక్ తదితరులు ఎమ్మెల్యే సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతపై శ్రద్ధ వహించాలి : చింతమనేని



రహదారి పనులను పరిశీలిస్తున్న చింతమనేని ప్రభాకర్


పెదపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనుల నాణ్యతపై అశ్రద్ధ వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడులో రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. రోడ్ల నిర్మాణంలో అలసత్వం ప్రదర్శిస్తున్న కాంట్రాక్టర్ తీరు మార్చుకోవాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీపడినా, అవినీతి, అలసత్వాలకు పాల్పడితే సహించబోమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో చేయని పనులకు బిల్లులు, నాణ్యత లేని పనులు చేసి ప్రజాధనాన్ని దోచుకున్నారని, కూటమి ప్రభుత్వంలో చెల్లదన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న పాత్రికేయ సంఘాల నేతలు




శ్రీవారి ఆశీర్వచన మండపంలో జర్నలిస్టు సంఘ నేతలు

ద్వారకాతిరుమల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని జాతీయ జర్నలిస్టు సంఘ నేతలు పలువురు గురువారం సందర్శించారు. సంఘ అధ్యక్షుడు రాస్ బిహారీ, తదితరులు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించే నిమిత్తం రెండు రోజుల సమావేశం విజయవాడలో జరుగుతోంది. వారు ఆలయానికి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించారు. దాదాపు 20 రాష్ట్రాల పాత్రికేయులకు స్వామివారి చరిత్ర, వైభవాన్ని పండితులు చెప్పారు. శివకుమార్, రాణా, ఏపీ అధ్యక్షుడు పున్నంరాజు, యుగంధర్‌రెడ్డి, సుభాష్ బాబు, వెంకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.









కె.కోట మండలం రామన్నపాలెం, పెదవేగి మండలం వంగూరు, బుట్టాయగూడెం మండలం అలివేరు గ్రామంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, జగన్నాథపురంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

భూ సమస్యలు పరిష్కరిస్తాం

రెవెన్యూ సదస్సులలో వినతులు స్వీకరించిన అధికారులు

కామవరపుకోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భాగంగా వచ్చిన వినతులపై తక్షణ చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ గెడ్డం ఎలీషా అన్నారు. మండలంలోని రామన్నపాలెంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజలు, రైతుల నుంచి వినతులు స్వీకరించి వాటిపై విచారణకు ఆదేశించారు. మాజీ ఎంపీపీ మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, సుబ్బలక్ష్మి, ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వోలు నాగరాణి, రాటాలు, కంకిపాటి నాగేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

● పెదవేగి: భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సు లక్ష్యమని తహసీల్దారు ఎస్వీ.భ్రమరాంబ అన్నారు. వంగూరులో పలువురు రైతులు రెవెన్యూ సంబంధ అంశాలపై వినతులు అందించారు. ప్రధానంగా రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రామసభల నిర్వహణ జరుగుతోందన్నారు. సర్పంచ్ చీలి రూతు జోసఫ్, ఆర్ఐ కేవీ.సారథి, సర్వేయర్ సత్యనారాయణ మూర్తి, సుంకర బాస్కరరావు, గోపిశెట్టి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: భూ సమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ టీవీఎస్ సాయిబాబా తెలిపారు. అప్పలరాజుగూడెంలో సదస్సు నిర్వహించి రైతుల నుంచి వినతులు స్వీకరించారు. 27 దరఖాస్తులు అందినట్లు ఆయన తెలిపారు. రీసర్వే డీటీ స్రవంతి, వీఆర్వోలు సుభాష్‌చంద్రబోస్, ప్రసాద్, మాధవి, గన్నిన సురేంద్రనాథ్ చౌదరి, కాటేపల్లి సత్యనారాయణ, పరిమి పుల్లారావు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: అలివేరు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో భూములున్న రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని, పేర్లను ఆన్‌లైన్ చేయాలని కొండరెడ్లు, గిరిజనులు తహసీల్దార్ పీవీ.చలపతిరావుకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో కొండరెడ్లు, కోయ గిరిజనుల భూములు తమ పూర్వీకుల పేరిట ఉన్నాయని, వారంతా చనిపోయి 40 ఏళ్లు కావస్తుందని తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. ఎవరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు కాలేదన్నారు. బ్యాంకు రుణాలు, రైతు భరోసా, సబ్సిడీలు కోల్పోతున్నామని అధికారులకు తెలిపారు. రైతులందరికీ పాస్ పుస్తకాలు, ఆన్‌లైన్ అడంగల్, 1బి నమోదు చేయాలని కోరారు. సర్పంచ్ కారం లక్ష్మీ, ఎంపిటిసి కొవ్వాసు గోవిందరాజు, కారం రాఘవ, కారం వాసు రెవెన్యూ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

● లింగపాలెం: మండలంలోని బాదరాలలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూసమస్యలపై 8 మంది రైతులు అర్జీలు అందజేశారు. తహసీల్దార్ నజీముల్లాషా మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సీహెచ్ చిన నాగేశ్వరరావు, బొల్లినేని శ్రీనివాసరావు, గరిమళ్ల చలపతిరావు, రైతులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: మండలంలోని లక్కవరంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు కె.స్లీవజోజి అధ్యక్షతన సదస్సులో 40 అర్జీలను స్వీకరించారు. వాటిలో 35 సమస్యలను పరిష్కరించినట్లు తహసీల్దారు తెలిపారు. డీటీ రమేష్, నాయకులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: భూముల రక్షణకు ప్రభుత్వం రెవెన్యు సదస్సులు నిర్వహిస్తుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. జగన్నాథపురంలో జరిగిన రెవెన్యు సదస్సులో ఆయన పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండో సంతకం ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేసేందుకు సీఎం చేశారన్నారు. భూ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గ్రామంలో పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు అవకతవకలపై విచారణ జరపాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. తాగునీటి సమస్య పరిష్కరించేందుకు బోరు మోటరు ఏర్పాటు చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గడ్డమణుగు రవికుమార్, పసుపులేటి రాము, సరిపల్లి సత్యనారాయణరాజు, కొర్రి అశోక్, మడివి నారాయణ, చిర్రి శ్రీను, జమ్మి గోపి ఉన్నారు.

● పెదపాడు: రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీటీ కె.సునీత తెలిపారు. కలపర్రులో నిర్వహించిన సదస్సులో రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 17 దరఖాస్తులు అందాయని వీఆర్వో సాయల వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ కోదండరాం, మాజీ సర్పంచ్ నూకల నాగేశ్వరరావు, వీఆర్వోలు నటరాజన్ దాస్, శర్మ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా కరపత్రాలు ఆవిష్కరించిన నేతలు

స్వీపర్లకు, ఆయాలకు జీతాలు వెంటనే విడుదల చేయాలి

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్లు, ఆయాలకు ఐదు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.బుచ్చిబాబు డిమాండ్ చేశారు. మండలంలో పలు పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ఈనెల 16న ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం స్పందించి పాఠశాల స్వీపర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

● టినరసాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో చలో విజయవాడ కరపత్రాలను ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు ఆవిష్కరించారు. ధర్నాకు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. పద్మ, మంగమ్మ, రాధా, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్లు, ఆయాలకు జీతాల బకాయిలు విడుదల చేయాలని బుచ్చిబాబు, టి.బాబు కోరారు. ఈనెల 16న విజయవాడలో జరిగే ధర్నా పోస్టర్‌ను సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. యూనియన్ నాయకురాలు ఆదిలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

జీతాలు విడుదల చేయండి

ఏలూరు క్రైం, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోపి ప్రభుత్వాసుపత్రులలో పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందికి 4 నెలలుగా జీతాలు లేవని, వెంటనే చెల్లించాలని కోరారు. మెడికల్ కాంట్రాక్టు, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, కార్యదర్శి వి దత్తాత్రేయ (దత్తు) వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి గురువారం వినతిపత్రాన్ని పంపించారు. జీతాల బడ్జెట్‌ను విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు వినతిపత్రాలను పంపించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ఉంగుటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బీవీ.శ్రీనివాస్ గురువారం పంపిణీ చేశారు. మార్చిలో జరిగే పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. అకాడమీ గైడెన్స్ మానిటరింగ్ ఆఫీసర్ సీహెచ్‌వీవీ.రామచంద్రరావు, కేర్ టేకర్ లెక్చరర్లు కెవై.నాయుడు, దుర్గయ్య జి.శ్రీనివాసు, శ్రీకాంత్, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ స్టౌ మంట వృద్ధురాలి చీరకు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడింది. దుగ్గిరాలకు చెందిన గంధమనేని మాణిక్యమ్మ (80) గురువారం ఉదయం గ్యాస్ స్టౌపై వేడి నీళ్లు దించే సమయంలో చీరకు మంటలు అంటుకున్నాయి. తీవ్ర గాయాలపాలైన ఆమెను కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విజయవాడకు రిఫర్ చేశారు.

వృద్ధుడు అదృశ్యం

ఏలూరు క్రైం: ఇంటి నుంచి వెళ్లిన ఒక వృద్ధుడు తిరిగి రాలేదని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. బావిశెట్టివారిపేటకు చెందిన ఇనపకుర్తి నారాయణరావు 40 ఏళ్లుగా పెద్ద మార్కెట్లో చాక్లెట్లు, బిస్కెట్లు వ్యాపారం చేస్తున్నాడు. ఈనెల 11న ఉదయం ఇంటి నుంచి షాపు వద్దకు వెళ్లాడు. అయితే షాపుకు వెళ్లలేదు, ఇంటికి రాలేదు. అతని కోసం ఎంత వెతికినా ఆచూకీ కానరాలేదు. కుమారుడు ఫణీంద్ర ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయడంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా స్థావరాలపై దాడులు

చింతలపూడి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మధ్యాహ్నపువారిగూడెంలో సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు గురువారం దాడి చేశారు. తాటిపర్తి వెంకటరమణ నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 1600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అతనిపై పరారీ కేసు నమోదు చేశారు. మక్కినవారిగూడెం పాత బెల్టు షాపు కేసులో దొంత కౌసల్యారావును తహసీల్దార్ వద్ద హాజరుపరిచి బైండోవర్ చేసినట్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు. ఎస్ఐలు నరసింహారావు, ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై కేసు నమోదు

జీలుగుమిల్లి, డిసెంబరు 12, (ఆంధ్రజ్యోతి): అంకన్నగూడెంలో ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు ఆధ్వర్యంలో దాడులు చేశారు. గ్రామానికి చెందిన మహిళ వద్ద 15 తెలంగాణ మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎన్ఎస్. సుబ్రహ్మణ్యం ఉన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వాహనంలోని చికెన్ వ్యర్థాలను గ్రామం బయట గొయ్యి తీసి పూడ్చి పెట్టించామన్నారు. వాహన యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేసి పెదపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పట్టు చీర చూపుతున్న మినాక్షి చౌదరి

తాడేపల్లిగూడెంలో చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభం

సందడి చేసిన హీరోయిన్ మీనాక్షి చౌదరి

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో గురువారం చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా లక్కీభాస్కర్ సినిమా హీరోయిన్ మీనాక్షి చౌదరి సందడి చేశారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, విప్ బొలిశెట్టి శ్రీనివాస్, స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజి పలు విభాగాలు ప్రారంభించారు. నటి మీనాక్షి చౌదరి పట్టు చీరల విభాగం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీనాక్షి చౌదరి మాట్లాడుతూ సినీ పరిశ్రమలో తనను ఆదరిస్తున్న ప్రేక్షకులకు, తనకు అవకాశం ఇస్తున్న నిర్మాతలు, దర్శకులు, హీరోలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నై షాపింగ్‌మాల్ యాజమానులు జనార్దనరెడ్డి, మర్రి వెంకటరెడ్డి, ఆర్యవైశ్య సంఘ గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా కొనుగోలు దారులు హాజరై వస్త్రదుకాణంలో ప్రారంభోత్సవ ఆఫర్‌కు ఆకర్షితులయ్యారు. ముఖ్యంగా రూ.99లకే చీర ఆకట్టుకుంది.

రాజమండ్రి- ఢిల్లీ విమాన సర్వీసులు

ప్రారంభించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు



మధురపూడిలో నూతన సర్వీసు ప్రారంభించి ఎంపీ పురందేశ్వరికి కేక్ అందిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

కోరుకొండ, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి నూతనంగా విమాన సర్వీసు ప్రారంభించడం ద్వారా ఇన్నాళ్లకు ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. న్యూఢిల్లీ రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి నేరుగా గురువారం ఉదయం 9 గంటలకు 6ఈ364 ఇండిగో విమాన సర్వీసు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంది. నియమాలను అనుసరించి నీటిని వెదజల్లి నూతన విమాన సర్వీసుకు స్వాగతం పలికారు. ఈ తొలి విమాన సర్వీసులోనే ప్రయాణికులతో కలిసి న్యూఢిల్లీ నుంచి రాజమహేంద్రవరం చేరుకున్న కేంద్ర విమానయానశాఖా మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఢిల్లీ నుంచి బయల్దేరి వచ్చిన ఈ తొలి విమాన సర్వీసుకు మధురపూడి విమానాశ్రయం వద్ద రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయశ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, జ్యోతుల నెహ్రూ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, జాయి ంట్ కలెక్టర్ ఎస్.చినరాముడు, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర్‌లు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాజమండ్రి విమానాశ్రయ ం వద్ద కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి రాజమండ్రి నుంచి న్యూఢిల్లీకి వెళ్లే నూతన విమాన సర్వీసును ఉదయం 9.45 గంటలకు ప్రారంభించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడు తూ రాజమహేంద్రవరం విమానాశ్రయం అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి మాట్లాడుతూ మొట్టమొదటి అడుగుగా రాజమండ్రి నుంచి దేశ రాజధాని ఢిల్లీకి నూతన ఎయిర్‌బస్ కల్పించిన ఘనత ప్రధాని నరేంద్రమోదీదేనన్నారు. త్వరలో గోదావరి పుష్కరాలు రానున్న నేపథ్యంలో రాజమహేంద్రవరానికి యావత్తు భారతదేశానికి విమాన సర్వీసులు అవసరమయ్యే ఆవశ్యకత ఉందన్నారు. అలాగే రాజమహేంద్రవరం నుంచి తిరుపతి, వారణాసి, షిరిడి వంటి నగరాలకు విమాన సర్వీసులు నడిపేలా కేంద్ర మంత్రి కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రయాణికులతో మధురపూడి విమానాశ్రయం నుంచి బయల్దేరిన ఇండిగో నూతన విమాన సర్వీసు మధ్యాహ్నం 12 గంటలకు న్యూఢిల్లీకి వెళ్లింది. ఈనెల 1న వాణిజ్య రాజధాని ముంబైకి విమాన సర్వీసు ప్రారంభమైన సంగతి తెలిసిందే.



భలే..భలే జీడి

షష్టి ఉత్సవాల్లో ఇవే హైలెట్

వియ్యపురాలి జీడిలుగా పేరు..

ముదినేపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఉభయ గోదావరి జిల్లాల్లో వియ్యపురాలి జీడిలకు ఒక ప్రత్యేక ఉండేది. వివాహ సమయాల్లో తమ కుమార్తెను అత్తింటి వారికి కాపురానికి పంపే సందర్భంలో బెల్లంతో తయారు చేసిన జీడిలను వియ్యపురాలికి కానుకగా పంపేవారు. అందుకే ఇవి వియ్యపురాలి జీడిలుగా పేరుగాంచాయి. అయితే ఈ సంప్రదాయం రాను రాను తగ్గుముఖం పట్టి కొత్త సారెల సంప్రదాయం రావడంతో ఈ వియ్యపురాలి జీడిలు కాస్తా వ్యాపార రంగంలోకి అడుగు పెట్టాయి. వీటిని తయారు చేసే వ్యాపారులు ఇప్పటికీ వియ్యపురాలి జీడిలుగా అమ్ముతున్నారు. ఎందుకంటే గతంలో వాటికి ఒక పేటెంట్ పేరు ఏర్పడి ప్రసిద్ధి చెందటంతో దుకాణాల్లో వియ్యపురాలి జీడిలుగానే చెలామణి జరుగుతోంది. ఉత్సవాల్లో ఈ జీడిల అమ్మకం జోరుగా సాగుతుంది. ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో ఏడాదికి ఒకసారి జరిగే వార్షిక షష్టి కల్యాణ తిరునాళ్లో జీడిల దుకాణాలు పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేస్తారు. అమ్మకాలు కూడా అలాగే ఉంటాయి. తూర్పుగోదావరి జిల్లా అమలాపురం ప్రాంతానికి చెందిన వ్యాపారులు ఎక్కువగా ఇక్కడ వ్యాపారం చేస్తారు. సుమారు దశాబ్ద కాలంగా స్థానికులు కూడ కొందరు ఈ వ్యాపారం నిర్వహిస్తున్నారు. అక్కడికక్కడే గంట వ్యవధిలోనే వేడివేడిగా తయారు చేసి అమ్ముతుండటంతో ఈ జీడీలు హాట్ కేక్‌లుగా అమ్ముడు పోతున్నాయి. కేజీ రూ.160 చొప్పు అమ్ముతారు.

బెల్లంతోనే తయారీ..

పూర్తి బెల్లంతోనే ఈ జీడిలను తయారు చేస్తారు. ముందుగా పెద్ద అల్యూమినియం పాత్రలో బెల్లం పాకం పట్టి, గట్టి పరచి, పెద్ద సుద్దగా తయారు చేస్తారు. ఆ బెల్లపు సుద్దను సాగదీసి కడ్డీలుగా తయారు చేసి రౌండు ముక్కలుగా నరుకుతారు. చూసేందుకు చాలా తేలిగ్గా కనిపించినా పాకం గట్టి పరచడం.. వాటిని జీడిలుగా తయారు చేయడం కష్టమైన ప్రక్రియే..

లాభాలు తగ్గాయి



పూర్వీకులు వియ్యపురాలి జీడిలను తయారు చేసి వివాహ సంప్రదాయాలు పాటించే వారికి సరఫరా చేసేవారు. ఇప్పుడు సరుకుల ధరలు పెరిగాయి.. తయారు చేసే వారికి వేతనాలు పెరగటంతో పెద్దగా లాభాలు ఉండడం లేదు.. సంప్రదాయ వ్యాపారం వదల్లేక ఇదే వృత్తిలో కొనసాగుతున్నాం.

-గోకరం వీరబాబు, అమలాపురం



తయారు చేస్తున్న దృశ్యం



సింగరాయపాలెంలో జీడిల దుకాణం

భూ సమస్యలపై వినతుల స్వీకరణ



అక్కిరెడ్డిగూడెంలో అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

ముసునూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిగూడెంలో జరిగిన రెవెన్యూ గ్రామసభలో తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ వివిధ భూసమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. గ్రామసభల ద్వారా భూ సమస్యలను తెలుసుకుని, వాటికి శాశ్వత పరిష్కారాన్ని చూపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తహసీల్దార్ తెలిపారు. ఈ గ్రామసభలో భూ సమస్యలపై 30 అర్జీలు వచ్చినట్లు ఆయన చెప్పారు. శుక్రవారం యల్లాపురంలో గ్రామసభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ సత్యనారాయణ, గ్రామ టీడీపీ అధ్యక్షులు బర్మా శ్రీనివాసరావు, వీఆర్వో హరిబాబు పాల్గొన్నారు.

నూజివీడు: సుంకొల్లులో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. నూజివీడు తహసీల్దార్ సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో దాదాపు 34 అర్జీలు దాఖలైనట్లు తహసీల్దార్ తెలిపారు. వ్యవసాయ భూములకు సంబంధించి పాస్ పుస్తకాలు మంజూరు, సర్వే నిర్వహణ, తదితర అంశాలపై అర్జీలు దాఖలైనట్లు ఆయన తెలిపారు.

చాట్రాయి: మండలంలోని తుమ్మగూడెం సచివాలయంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో సర్వే కోసం 5, పట్టాదారు పాస్ పుస్తకాల కోసం 8 మొత్తం 13 అర్జీలు వచ్చినట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ వెంకటరత్నం, తహసీల్దార్ ప్రశాంతి, సర్పంచ్ మారెమ్మ పాల్గొన్నారు.

తొమ్మిది మంది విద్యార్థులకు అస్వస్థత

- వికటించిన మధ్యాహ్న భోజనం
- నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలింపు
- కోటపాడు ఎంపీయూపీ స్కూల్‌లో ఘటన



చికిత్స పొందుతున్న విద్యార్థులు

చాట్రాయి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా చాట్రాయి మండలం కోటపాడు ఎంపీయూపీ స్కూల్‌లో గురువారం మధ్యాహ్న భోజనం తిన్న 9 మంది విద్యార్థులు కడుపు నొప్పి, వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్న భోజనం తిన్న తరువాత 4వ తరగతి విద్యార్థులు టి.సిరి స్పందన, ఎస్.ఉదయ్ కుమార్, టి.వర్షిణి, 5వ తరగతి విద్యార్థులు ఎస్.కల్పన, ఎస్.అమృత, ఎస్.లాస్య, 7వ తరగతి విద్యార్థులు టి.కాంతి మేఘన, టి.ఉమా యశ్వంత్, మంచిన దుర్గా మనీష్ కడుపు నొప్పితో కొందరికి వాంతులు అవుతుండటంతో ఉపాధ్యాయులు వెంటనే ఎంఈవో బ్రహ్మచారికి , పీహెచ్‌సీ వైద్యులకు సమాచారం ఇచ్చారు. స్కూల్‌కు చేరుకున్న వైద్యాధికారి దుర్గాప్రసాద్ నూజివీడు ఏరియా ఆసుపత్రికి పంపారు. నూజివీడులో చికిత్స అనంతరం విద్యార్థులకు ప్రమాదం తప్పింది. బంగాళా దుంప కూరలో రాగి పిండి కలపటం వలన తమ పిల్లలకు ఈ పరిస్థితి వచ్చిందని తల్లిదండ్రులు తెలిపారు. కోటపాడు సర్పంచ్ పరసా సత్యనారాయణ నూజివీడు ఆసుపత్రికి వెళ్ళి పిల్లలకు వైద్య సేవలు అందే విధంగా కృషి చేశారు.

గ్రామాల అభివృద్ధి లక్ష్యం కావాలి: ఎంపీడీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

చాట్రాయి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయటానికి ప్రజా ప్రతినిధులు అధికారులు అంకితభావంతో కృషి చెయ్యాలని ఎంపీడీవో విజయలక్ష్మి కోరారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. 2047 నాటికి గ్రామాలను ఆదర్శవంతంగా అభివృద్ధి చేయటానికి 9 లక్ష్యాలతో గ్రామ పంచాయతీలు పోటీ పడాలని ఉద్బోధించారు. ఎంఈవో బ్రహ్మచారి, వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, ఏవో విష్ణు పాల్గొన్నారు.

16న చెరువులు లీజు వేలం

చాట్రాయి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలోని పెద్ద చెరువు, దీప చెరువులలో చేపలు పెంచుటకు 16వ తేదీ సాయంత్రం బహిరంగ లీజు వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎంవిఎస్ నాగరాజు తెలిపారు, పాటలో పాల్గొనదలచిన వారు రూ.10 వేలు దరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని, పూర్తి వివరాలు చాట్రాయి పంచాయతీ కార్యాలయంలో తెలుకోవచ్చునని అన్నారు.

విద్యుత్ చౌర్యంపై తనిఖీలు

రూ.5.40 లక్షల జరిమానా



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

నూజివీడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న గృహ వినియోగదారులపై విజిలెన్స్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి, రూ.5.40 లక్షలు జరిమానాగా విధించటం జరిగిందని ట్రాన్స్‌కో ఈఈ ఏ.సత్యనారాయణ తెలిపారు. నూజివీడు మండలం మీర్జాపురం విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలో 2,994 గృహ సర్వీసులు, 156 వాణిజ్య సర్వీసులను తనిఖీచేసి 165 సర్వీసులకు అదనపు లోడ్‌ను నిర్ధయించి, రూ.5.40లక్షల జరిమానాను విధించటం జరిగిందన్నారు. విజిలెన్స్ తనిఖీల్లో నూజివీడు రూరల్ డీఈ ఎం.పోతురాజు, మీర్జాపురం ఏఈ ఏ.బాబురావు సిబ్బంది పాల్గొన్నారు.

ఏకగ్రీవం దిశగా..

- రేపు సాగునీటి సంఘాల ఎన్నికలు
- కైకలూరు నియోజకవర్గంలో 39 సాగునీటి సంఘాలు
- గత ఐదేళ్లు నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

కైకలూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిపి పునర్జీవం పోసేందుకు కూటమి ప్రభుత్వం ఈ నెల 14న శ్రీకారం చుట్టింది. సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నారు. సాగునీటి సంఘాలకు చిట్టచివరిగా 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎన్నికలు జరిగాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ హయంలో ఎన్నికైన సాగునీటి సంఘాల పదవీకాలం ముగిసిన కొద్దికాలానికే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గత ఐదేళ్లల్లో ఒక్కసారి కూడా సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించిన పాపాన పోలేదు. వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే సాగునీటి సంఘాలను నిర్వీర్యం చేసింది.

కైకలూరు నియోజకవర్గంలో 56,323 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో కైకలూరు మండలంలో 8,050 మంది ఓటర్లకు ఐదు సాగునీటి సంఘాలు ఎన్నికలు నిర్వహించనున్నారు. కలిదిండి మండలంలో 15,217 ఓటర్లకు 12 సాగు నీటిసంఘాలకు, ముదినేపల్లి మండలంలో 17,196 ఓటర్లకు 12 సాగు నీటి సంఘాలు, మండవల్లి మండలంలో 15, 860 ఓటర్లకు పది సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించ నున్నారు. ఇప్పటికే ఆయా మండలాల్లో రెవెన్యూ అధికారులు ఇప్పటికే పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఒక్కో సంఘానికి 12 మంది డైరెక్టర్లు ఉంటారు. ఉదయం 9 నుంచి 9.15 గంటలకు నామినేషన్లు స్వీకరణ, తుది జాబితా 9.30 గంటలకు విడుదల, అవసరమైన ఎన్నికల ప్రక్రియ ఉదయం 9.30 నుంచి 10గంటల వరకు, లెక్కింపు, అధ్యక్షుడి ఫలితాలు వెల్లడి 10 గంటల నుంచి 10.30 గంటల వరకు, ఉపాధ్యక్షుల నామినేషన్ల స్వీకరణ 11 గంటల నుంచి 11.15 వరకు, నామినేషన్ల తుది జాబితా 11.15 నుంచి 11.30వరకు, అవసరమైతే ఎన్నికల ప్రక్రియ 11.30 నుంచి 12.00గంటల వరకు లెక్కింపు, ఫలితాల ప్రకటన 12 గంటల నుంచి 12.15వరకు నిర్వహించనున్నారు. అనంతరం యాజమాన్య కమిటీ సమా వేశం నిర్వహిస్తారు.

ఏకగ్రీవ దిశగా సాగునీటి సంఘాలు..

ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్ని సంఘాలతో స్థానికంగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఏకగ్రీవ దిశగా సూచనలు చేశారు. దీంతో రైతులందరూ ఏకాభిప్రాయానికి రావడంతో మొత్తం 39 సంఘాలను ఏకగ్రీవంగా ఎన్నుకునే పరిస్థితులు నెలకొన్నాయి. 2, 3 సంఘాల్లో పరిధిలో కాస్తా సందిగ్ధత ఉన్నప్పటికీ రేపటి కల్లా వాటిని కూడా ఏకగ్రీవం చేసేందుకు కామినేని కృషి చేస్తున్నారు.

ముదినేపల్లి మండలంలో అభ్యర్థుల ఖరారు

ముదినేపల్లి : ముదినేపల్లి మండలంలోని 12 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఏకగ్రీవం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తో మండల టీడీపీ, జనసేన నాయకులు చర్చలు జరిపిన అనంతరం అభ్యర్థులను ఖరారు చేశారు. ముదినేపల్లి డీసీ చైర్మన్ అభ్యర్థి మార్పు తప్ప అన్ని సంఘాలకు, డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులు, ఉపాధ్యక్ష పదవులకు అభ్యర్థులు దాదాపు ఖరారయ్యారు. మండలంలోని 12 నీటి సంఘాల్లో పది సంఘాలు, తెలుగుదేశం పార్టీకి, రెండు సంఘాలు జనసేనకు కేటాయించారు. ఈ నెల 14న జరగనున్న ఆయకట్టు దార్ల సమా వేశంలో సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక లాంఛనమేనని చెప్పవచ్చు. ముదినేపల్లి డీసీ చైర్మన్ బీసీలకు, వైస్ చైర్మన్ ఒసి, పెదగొన్నూరు డీసీ చైర్మన్ ఒసిలకు, వైస్ చైర్మన్ బీసీలకు కేటాయిం చినట్టు తెలిసింది.



పెంచికలమర్రు సదస్సులో ఇన్‌చార్జి తహసీల్దార్ ఇబ్రహీం, తదితరులు

త్వరితగతిన భూసమస్యలు పరిష్కరిస్తాం

కైకలూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామసభలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం అన్నారు. గురువారం కైకలూరు మండలం పెంచికలమర్రులో రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. గ్రామానికి చెందిన పలు భూసమస్యలను 12 అర్జీల ద్వారా అధికారులకు ప్రజలు అందజేశారు. మాజీ సర్పంచ్ జయమంగళ సుబ్బరాజు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాళ్లపాలెంలో 25 అర్జీల స్వీకరణ

కలిదిండి : కాళ్లపాలెంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు భూ సమస్యలపై 25 అర్జీలు వచ్చాయని మండల ప్రత్యేకాధికారి భాస్కర్ తెలిపారు. భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ పేటేటి స్వర్ణకుమారి, తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ శ్యామల, సర్వేయర్ ఎం.షమి, వీఆర్వో పమిడేశ్వరరావు పాల్గొన్నారు.

నందిగామలంకలో రెవెన్యూ గ్రామసభ

మండవల్లి : భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవడానికి మంచి వేదిక రెవిన్యూ గ్రామసభలని ఇన్‌చార్జి తహసీల్దార్ గోపాల్ స్పష్టం చేశారు. మండలంలోని నందిగామలంకలో రెవిన్యూ గ్రామసభను గురువారం నిర్వహించారు. ఈ గ్రామసభలో ఆయన మాట్లాడారు. భూసమస్యలను పరిష్కరించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం రెవిన్యూ గ్రామసభలను విధిగా నిర్వహిస్తుందన్నారు. రైతులు ఈ గ్రామసభలను సద్వినియోగం చేసుకుని భూమికి సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో శత కలశ పూజ

వైభవంగా అష్టోత్తర శత కలశ పూజ

ముదినేపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): షష్టి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో అష్టోత్తర శత కలశార్చన వైభవంగా జరిగింది. 108 కలశాలతో అభిషేకాలు నిర్వహించారు.దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి, సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, నీలం శివరమేష్, పరసా కృష్ణ, బెజవాడ నాగవెంకట రాధాకృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు బికెఎం. నాని, పూల రామచంద్రరావు, ప్రసాద్ రాజు తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కైకలూరు శ్యామల నాట్య అకాడమీ ఆర్గనైజర్ లక్ష్మీజ్యోతి శిష్య బృందం నిర్వహించిన నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది.

మనోజ్‌కు యాదవ సంఘం సత్కారం



ముదినేపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు విశ్వగురు వరల్డ్ రికార్డ్సు సంస్థ నుంచి జాతీయ స్థాయిలో బెస్ట్ ఫాదర్ అవార్డు అందుకున్న ముదినేపల్లికి చెందిన వైద్యుడు డాక్టర్ అంబుల మనోజ్‌కు శ్రీకృష్ణ యాదవ సంఘం ఘనంగా సత్కరించింది. గురువారం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ అవార్డు గ్రహీత డాక్టర్ మనోజ్‌ను సన్మానించారు.

రేపు సాగునీటి సంఘాల ఎన్నికలు

ముసునూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ అన్నారు. గురువారం ముసునూరు ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ 14వ తేదీన నిర్వహించే నీటి సంఘాల ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా పోలింగ్ జరపాలన్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికకు ఓటు హక్కు ఉన్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌లో ఒకటి తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. మండల పరిధిలో ఉన్న ఒక ఎస్ఏస్పీ మేజర్, 16 మైనర్ ఇరిగేషన్ చెరువులకు జరిగే ఎన్నికలకు 11,032 మంది రైతులు ఓటు హక్కు వినియోగించుకుంటారని తెలిపారు. ఈ ఎన్నికల నిర్వహణకు పది గ్రా మాల్లో ఉన్న జడ్పీ పాఠశాలల్లో పది పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక్క పోలింగ్ కేంద్రంలో ముగ్గురు అధికారులు ఉంటారని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ జరుగుతుందని అన్నారు. సమావేశంలో ఎంపీడీవో జి.రాణి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఏవో ఎస్.మధుమోహన్, డీటీ కె.వి.రమణ పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న పాత్రికేయ సంఘాల నేతలు

ద్వారకాతిరుమల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని జాతీయ జర్నలిస్టు సంఘ నేతలు పలువురు గురువారం సందర్శించారు. సంఘ అధ్యక్షుడు రాస్ బిహారీ, తదితరులు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించే నిమిత్తం రెండు రోజుల సమావేశం విజయవాడలో జరుగుతోంది. అక్కడి నుంచి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించారు. దాదాపు 20 రాష్ట్రాల పాత్రికేయులకు స్వామివారి చరిత్ర, వైభవాన్ని పండితులు చెప్పారు. శివకుమార్, రాణా, పున్నంరాజు, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు

ముసునూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింహాద్రిపురంలో బెల్ట్‌షాపు నడుపుతున్న మట్టా ధర్మారావును అదుపులోకి తీసుకున్నట్టు నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ ఎ.మస్తానరావు తెలిపారు. అతని వద్ద నుంచి 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యాను ఢీకొని విద్యార్థి మృతి



శామ్యూల్ మోజెస్ (ఫైల్)

కలిదిండి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బొలెరో వ్యాన్ ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి చెందిన ఘటన భాస్కరావుపేటలో జరిగింది. కలిదిండి మండలం భాస్కరావుపేటకు చెందిన ముద్దం బ్రహ్మజీ కుమారుడు శామ్యూల్ మోజెస్ (17) ఏలూరుపాడు జ్ఞానానందలో ఇంటర్ చదువుతున్నాడు. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో భాస్కరావుపేట - మట్టగుంట రోడ్డుపై బహిర్భూమికి వెళ్తుండగా వ్యాన్ ఢీకొనడంతో శామ్యూల్ మోజెస్‌కు తీవ్ర గాయాల య్యాయి. భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేతి కందిన కొడుకు దుర్మరణం చెందడంతో తల్లి దండ్రులు, కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న వ్యాన్.. ఇద్దరికి తీవ్ర గాయాలు

ముదినేపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం సమీపంలో గురువారం ఎదురుగా వస్తున్న బైక్‌ను వ్యాన్ ఢీకొనడంతో కొర్రగుంటపాలెంకు చెందిన ఇద్దరు యువకులకు తీవ్ర గాయాల య్యాయి. ముచ్చు నాగరాజు, సరస్వతీరావు చేపల పట్టుబడి పనులకు వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా, సింగరాయపాలెం సమీపంలో కోరుకొల్లు నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొనడంతో ఇద్దరి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని గుడివాడ ఆస్పత్రికి తరలించారు.

గన్నవరంలో ఇరుముళ్లు

మండవల్లి డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గన్నవరం గ్రామంలోని శివాలయం, రామాలయం శ్రీఅయ్యప్ప నామస్మరణలతో మారుమోగింది. చాగంటి శ్రీనివాసరావు గురుస్వామి, శొంఠి కుమార్‌స్వామి ఆధ్వర్యంలో గురువారం అయ్యప్ప మాలధారులకు ఇరుముళ్లు నిర్వహించారు. తొలుత ఆయా దేవాలయాల్లో వైభవంగా మహాగణ పతికి ప్రత్యేక పూజలు చేసి ఇరుముడి కట్టారు.

నేడు సువర్చల సహిత దాసాంజనేయస్వామి కల్యాణం

కైకలూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కైకలూరు-కోరుకొల్లు రోడ్డులోని శ్రీసువర్చల సహిత దాసాంజనేయ స్వామి 56వ కల్యాణ మహోత్సవాలను ఈ నెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 13వ తేదీ ఉదయం 8 గంటలకు స్వామి కల్యాణం, 15న ఉద్వాసన, 16న అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. ప్రతీ రోజూ సహస్ర, అష్టోత్తర శతనామ పూజలను నిర్వహించబడతాయన్నారు.